15న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 15వ తేదీ శనివారం చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ఉదయం పది గంటలకు రెండు, ఐదో స్థాయీ సంఘ సమావేశాలు, 11 గంటలకు 3,4, మధ్యాహ్నం 12 గంటలకు 1,6,7 స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. సంబంధిత అధికారులు తమ శాఖల ద్వారా అమలుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై నివేదికలతో జడ్పీ సమావేశ మందిరానికి హాజరుకావాలని కోరారు.

మధురవాడలో 2 ఐకానిక్ ప్రాజెక్టులు

రూ.460 కోట్లతో ఈస్ట్‌కోస్ట్ హేబిటేట్ సెంటర్

- సెంటర్‌లో... ఆఫీస్‌లకు అవసరమైన స్థలం, బిజినెస్ సెంటర్, ఆడిటోరియం, హోటల్, సర్వీస్ అపార్టుమెంట్, ఈవెంట్/ పార్టీ లాన్స్, ఫైన్ డైన్ రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్...
- మరొకటి... వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాల్టీ ఎరీనా అండ్ 3 స్టార్ హోటల్


హేబిటేట్ సెంటర్ నమూనా


- వై, జెడ్, ఆల్ఫా తరాల కోసం ఏర్పాటు
- ఆర్‌పీఎఫ్‌లు ఆహ్వానించిన వీఎంఆర్‌డీఏ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జనాభా విస్తృతంగా పెరుగుతున్న మధురవాడ ప్రాంతంలో మరో రెండు కీలకమైన ఐకానిక్ ప్రాజెక్టులకు విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళిక సిద్ధం చేసింది. కొత్త ప్రాజెక్టులన్నీ పీపీపీ విధానంలోనే చేపట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు వీటి టెండర్లకు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌పీఎఫ్) కోరుతూ ప్రకటన జారీచేసింది.

రూ.460 కోట్లతో ఈస్ట్‌కోస్ట్ హేబిటేట్ సెంటర్

లా కళాశాల రోడ్డులో పనోరమ హిల్స్ వద్ద సుమారు 8.82 ఎకరాల విస్తీర్ణంలో ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్ నిర్మించనుంది. ఇందులో ఆఫీస్‌లకు అవసరమైన స్థలం, బిజినెస్ సెంటర్, ఆడిటోరియం, ఎగ్జిబిషన్ హాల్, బొటిక్, హోటల్, సర్వీస్ అపార్టుమెంట్, ప్రీమియం క్లబ్, ఈవెంట్/పార్టీ లాన్స్ ఫైన్ డైన్ రెస్టారెంట్లు, స్పోర్ట్స్ సెంటర్, సూపర్ మార్కెట్, మెడికల్ సెంటర్, బ్యాంకులు ఉంటాయి. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.460 కోట్ల వరకూ వ్యయం అవుతుందని అంచనా. ముందుకువచ్చే వారికి 33 ఏళ్ల లీజుకు ఇస్తారు. నిర్మాణానికి మూడేళ్ల గడువు ఇవ్వనున్నట్టు వీఎంఆర్‌డీఏ వెల్లడించింది.


వీఆర్ ఎరీనా

కొత్త తరాలను ఆకట్టుకునేలా వీఆర్ ఎరీనా, 3 స్టార్ హోటల్

విశాఖపట్నం పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి సాధించడానికి నూతన తరాలను ఆకట్టుకునేలా వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాల్టీ ఎరీనా అండ్ 3 స్టార్ హోటల్ నిర్మాణానికి

... మిగతా 6వ పేజీలో


ఎర్రాజీ జ్యోతి

టార్గెట్ ఒలింపిక్స్

'టాప్స్' కోర్ గ్రూపులో ఒలింపియన్ ఎర్రాజీ జ్యోతికి స్థానం

- 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం
- కేంద్ర క్రీడా శాఖ నుంచి నెలకు రూ.50 వేలు ఉపకార వేతనం

విశాఖపట్నం, స్పోర్ట్సు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్)కు నగరానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్, ఒలింపియన్ ఎర్రాజీ జ్యోతి ఎంపికైంది. కోర్, డెవలప్‌మెంట్ అనే రెండు గ్రూపులకు సంబంధించి దేశవ్యాప్తంగా 206 మంది క్రీడాకారులను క్రీడా మంత్రిత్వ శాఖ ఎంపిక చేయగా...కోర్ గ్రూపులో పీవీ సింధు, నీరజ్ చోప్రా, మనుబాకర్ వంటి ఒలింపిక్ మెడలిస్టులతోపాటు నగరానికి చెందిన జ్యోతికి స్థానం లభించింది. ఈ మేరకు జ్యోతికి కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి నెలకు రూ.50 వేలు ఉపకార వేతనం అందనుంది. కాగా 2028లో లాస్ ఏంజెల్స్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో దేశానికి పతకాలు అందించే సామర్థ్యం కలిగిన ఉన్నత క్రీడాకారులకు ఈ 'టాప్స్' కోర్ గ్రూపులో చోటు దక్కుతుంది. గత ఏడాది పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో

... మిగతా 6వ పేజీలో

బియ్యం, కందిపప్పు ధరలు తగ్గుముఖం

- 26 కిలోల బస్తా హోల్‌సేల్‌లో రూ.1,500
- రిటైల్‌లో రూ.1,550
- సన్నరకాలు కిలో రూ.44
- కందిపప్పు మరింత చౌక...
- పూర్ణామార్కెట్‌లో కిలో రూ.110కే విక్రయం
- రైతుబజార్లలో ఇంకా రూ.120కే అమ్మకం
- ప్రత్యేక దుకాణాలను తొలగించని వర్తకులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మార్కెట్‌లో బియ్యం, కందిపప్పు ధరలు దిగి వచ్చాయి. ఈ ఏడాది ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం దిగుబడులు అధికంగా రావడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇంతకుముందు రూ.1,650 నుంచి రూ.1,700 మధ్య విక్రయించిన టాప్ బ్రాండ్ బియ్యం లలిత, అక్షయ, తదితర రకాలు (26 కిలోలు) ఇప్పుడు హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.1,500కే దొరుకుతున్నాయి. వీధుల్లో రిటైలర్లు రూ.1,550కు అమ్ముతున్నారు.

సన్నరకాలు అంటూ అమ్మిన కొత్త బియ్యం ధర ఇంతకుముందు కిలో రూ.48 నుంచి 56 మధ్య ఉండేది. ఇప్పుడు కిలో రూ.44కి దిగి వచ్చింది. హోల్‌సేల్ మార్కెట్‌లో అయితే వంద కిలోలు రూ.4,100కే ఇస్తున్నారు. వాటిని రిటైలర్లు కిలో రూ.44 చొప్పున ఇస్తున్నారు. ధరలన్నీ నెల రోజుల నుంచి క్రమంగా దిగివస్తున్నా రైతుబజార్లు, రిటైల్ షాపుల్లో మాత్రం తగ్గించి అమ్మడం లేదు. కొత్త రకం బియ్యం ధరలే తగ్గాయని, పాత రకాలు తగ్గలేదని బుకాయిస్తున్నారు.

కందిపప్పు కిలో రూ.110కే

కందిపప్పు ధర గత ఏడాది భారీగా పెరిగిపోయింది. నాణ్యత కలిగిన రకం కిలో రూ.190 వరకు వెళ్లింది. దాంతో ప్రభుత్వం హోల్‌సేల్ డీలర్లతో మాట్లాడి రైతుబజార్లలో వారికి ఉచితంగా దుకాణాలు ఇచ్చి కిలో రూ.120 చొప్పున అక్టోబరు నెల నుంచి అమ్మిస్తోంది. అయితే కంది పప్పు ధర నెల రోజుల క్రితమే తగ్గిపోయింది. హోల్‌సేల్‌లో కిలో రూ.103కి ఇస్తున్నారు. బయట రూ.105 నుంచి రూ.110 మధ్య దొరుకుతోంది. అయితే రైతుబజార్లలో డీలర్ల అసోసియేషన్ పెట్టిన ఉచిత దుకాణాల్లో అదే పప్పు యథా ప్రకారం కిలో రూ.120కి అమ్మి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు గానీ, ఇటు పౌర సరఫరాల శాఖ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. అదే కందిపప్పు అదే రైతుబజార్లలో పక్కనే ఉన్న డీసీఎంఎస్ దుకాణాల్లో కిలో రూ.110 చొప్పున అమ్ముతున్నారు. వారు నెలకు రూ.30 వేలు అద్దె కడుతున్నారు.

రేషన్ డీలర్లు ఉచితంగా స్టాల్ తీసుకొని ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. దీనిపై జాయింట్ కలెక్టర్ దృష్టిసారించాలని వ్యాపారులు కోరుతున్నారు. అలాగే బియ్యం, ఇతర సరకుల ధరలు తగ్గినందున ఆ ప్రయోజనం వినియోగదారులకు అందేలా చూడాల్సిన అవసరం ఉంది. తక్షణమే నిత్యవసర ధరల మానటరింగ్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేసి తగిన నిర్ణయం తీసుకోవలసి ఉంది.

వైసీపీ ఆందోళన



విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త కురసాల కన్నబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, 'నార్త్' సమన్వయకర్త కేకే రాజు, తదితరులు -వార్త 8వ పేజీలో...

కన్నుల పండువగా అనంత పద్మనాభుని తెప్పోత్సవం


కన్నయ్య కోనేరులో విహరిస్తున్న స్వామివారు


తెప్పపై శ్రీదేవి, భూదేవి సమేత అనంత పద్మనాభుడు

అనంత పద్మనాభుని తెప్పోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. భక్తుల జయ, జయ ధ్వానాల మధ్య శ్రీదేవి, భూదేవి సమేతుడైన అనంతపద్మనాభుడు పద్మనాభం జంక్షన్‌లోని కన్నయ్య కోనేరులో ప్రత్యేకంగా అలంకరించిన పడవపై విహరించారు. ఉత్సవం సందర్భంగా కోనేరు చుట్టూ విద్యుద్దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో టీడీపీ యువనాయకుడు గంటా రవితేజ, ఎంపీపీ రాంబాబు, ఈఓ నానాజీబాబు, తదితరులు పాల్గొన్నారు. -8లో

యువత పోరులో కనిపించని విద్యార్థులు

- కంగుతిన్న వైసీపీ నేతలు

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'యువత పోరు' కార్యక్రమంలో విద్యార్థులు ఒక్కరు కూడా కనిపించలేదు. ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యా సంస్థల యాజమాన్యాలు హాల్‌టికెట్లు ఇవ్వడం లేదని, దీనివల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వారికి అండగా నిలిచేందుకు యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వైసీపీ ప్రకటించింది. అయితే బుధవారం కలెక్టర్ వద్ద చేపట్టిన కార్యక్రమంలో విద్యార్థులు ఒక్కరు కూడా కనిపించకపోవడంతో ఆ పార్టీ నేతలు కంగుతిన్నారు. వైసీపీ నేతలకు చెందిన సంస్థల నుంచి రప్పించేందుకు యత్నించినప్పటికీ విద్యార్థులు విముఖత వ్యక్తంచేసినట్టు ఆ పార్టీ నేతలు కొందరు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీరుతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నప్పుడు వారిని ముందుపెట్టి కార్యక్రమం నిర్వహించి ఉంటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తంచేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.09
సహరి (శుక్ర)	4.50

స్వయం ఉపాధికి ఊతం

సంక్షేమ శాఖలకు మళ్లీ ఊపిరి

- వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యం

- బీసీ కార్పొరేషన్ ద్వారా పలు పథకాల అమలుకు నిధులు మంజూరుచేసిన కూటమి ప్రభుత్వం
- సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు
- దరఖాస్తులు ఆహ్వానిస్తూ కలెక్టర్ ప్రకటన
- బీ.ఫార్మసీ/డీ.ఫార్మసీ పూర్తిచేసిన నిరుద్యోగ బీసీ, ఈబీసీ యువతకు జనరిక్ ఔషధ దుకాణాల ఏర్పాటుకు రుణం
- కుట్టు శిక్షణ, లబ్ధిదారులకు ఉచితంగా మిషన్లు పంపిణీకి ఆదేశాలు

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన సంక్షేమ శాఖలకు కూటమి ప్రభుత్వం మళ్లీ ఊపిరిలూదుతోంది. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ కార్పొరేషన్ల ద్వారా పథకాల అమలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందుకు నిధులు మంజూరుచేసింది. మైనారిటీ సంక్షేమ శాఖకు కొద్దిరోజుల కిందట నిధులు ఇచ్చింది. మరో వారం రోజుల్లో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మరికొన్ని పథకాల అమలుకు అనుమతి రానున్నదని అధికారులు చెబుతున్నారు.


బీసీ సంక్షేమ శాఖలో...

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెండు పథకాల అమలుకు ప్రభుత్వం నుంచి జనవరి నెలాఖరులోనే అనుమతి లభించింది. అయితే, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ వాయిదాపడింది. కోడ్ ముగియడంతో స్వయం ఉపాధి పథకాలకు ... మిగతా 6వ పేజీలో



పేదల గృహ నిర్మాణానికి రూ.305.13 కోట్లు

- ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా నిధులు
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్



విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అదనంగా ఆర్థిక సాయం అందిస్తున్నట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వెల్లడించారు. బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీ వర్గాలకు రూ.75 వేలు చొప్పున జిల్లాకు రూ.305.13 కోట్లు మంజూరుకానున్నట్టు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో హౌసింగ్ పీడీ సీహెచ్ సత్తిబాబుతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పీఎంఏవై కింద ఇళ్లు మంజూరై, ఇప్పటికీ పూర్తికానటువంటి వాటికి మాత్రమే ఈ సాయం లభిస్తుందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా 2029 నాటికి అందరికీ గృహాలు నిర్మించాలన్న సంకల్పంతో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పీఎంఏవై కింద ఒక ఇంటికి ప్రభుత్వం నిర్ణయించిన యూనిట్ ధర ... మిగతా 6వ పేజీలో


ప్రభుత్వ భూమి కబ్జా

'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 9న ప్రచురితమైన కథనం

ప్రభుత్వ భూమిలో కల్యాణ మండపం నిర్మాణంపై కదిలిన రెవెన్యూ

- నిర్మాణదారులకు నోటీస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):

గాజువాక బీసీ రోడ్డులో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని కల్యాణ మండపం నిర్మిస్తున్న వ్యక్తికి నోటీస్ జారీచేసినట్టు పెదగంట్యాడ తహశీల్దార్ అమల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదగంట్యాడ సర్వే నంబర్ 43/5/ఏలో గల ప్రైవేటు స్థలంతోపాటు సర్వే నంబర్ 43/1లోని ప్రభుత్వ భూమిలో ఒకరు కల్యాణ మండపం నిర్మిస్తుండడంపై ఈనెల తొమ్మిదో తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రభుత్వ భూమి కబ్జా' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో నిర్మాణంపై వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ నిర్మాణదారులు ఆదిరెడ్డి విజయకు మంగళవారం నోటీస్ పంపించారు. వారంరోజుల్లోగా వివరణ ఇవ్వని పక్షంలో తామే తొలగింపునకు రంగంలోకి దిగుతామని స్పష్టంచేశారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం (రూరల్) మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్ మండలంలో మూలకుద్దు ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతుండడంతో ఈనెల 14న (శుక్రవారం) ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మూలకుద్దు, ఎరుసుపేట, గుడివాడ,అమనాం, జీరుపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఆనందపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిడిజాల ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్ మరమ్మత్తులు చేపడుతున్నందున గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడనున్నట్టు ఏఈ సురేష్‌కుమార్ తెలిపారు. గిడిజాల, బాకురుపాలెం, మిందివానిపాలెం, గుమ్మడివానిపాలెం తదితర గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు 'అవంతి'లో సాంకేతిక సదస్సు

తగరపువలస, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస సమీపంలో అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం 'బియాండ్ ఇన్నోవేటివ్' పేరుతో సాంకేతిక సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ ఎం.శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారు. విశాఖ ప్రాస్పెటా టెక్నాలజీస్ సీఈవో పంతుల సుధాకర్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, అలాగే వివిధ ఐటీ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారని నిర్వాహకులు తెలిపారు.

బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తులకు 22 వరకు అవకాశం

పద్మనాభం-రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ రుణాలకు మండలంలో ఓబీఎంఎంఎస్ పోర్టల్ లేదా సచివాలయ ద్వారా అర్హులైన నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ఎం.విజయకుమార్ తెలిపారు. బుధవారం అయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు స్వీకరించలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 20 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన వారు కుట్టుమిషన్లు, శిక్షణకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.అర్హులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

వైభవంగా వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు

ఘనంగా సుదర్శన హోమం



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

భీమునిపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) :స్థానిక శ్రీపద్మావతి, గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు, నిత్య విశేష హోమాలు జరిగాయి. అనంతరం, ఆయురారోగ్య ఐశ్వర్య సిద్ధిని కాంక్షిస్తూ సుదర్శనహోమం చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు అప్పలాచార్యులు, శిష్యబృందం ఆధ్వర్యంలో వేదోక్తంగా హోమం సాగింది. సాయంత్రం దొంగల దోపిడీ ఉత్సవం దోపోత్సవం చేపట్టారు. తిరుమంగై ఆళ్వార్ చరిత్రను ఆచార్యులు పఠించారు. మధ్యాహ్నం మహా నివేదన అన్న ప్రసాద వితరణ జరిగింది. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. స్వామిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, నాయకులు గుగ్గిళ్ల వెంకటపార్వతీశం, సుజాత దంపతులు, రేలంగి అప్పలనరసయ్య, ఎం.సత్యానందరావు, గొరపల్లి సన్యాసిరావు, కె.ముత్యాలరావు, ఎ.శ్రీనివాసరావు తదితరులు దంపతులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు

హిందీ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత

భీమునిపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత హిందీ ప్రచార సభ, (చెన్నై) ఫిబ్రవరిలో నిర్వహించిన హిందీ పరీక్షల్లో భీమిలిలో ఆ పరీక్షలకు హాజరైన అభ్యర్థులందరూ ఉత్తీర్ణులైనట్టు ఆదర్శ హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కేఎస్ఆర్ కృష్ణారావు తెలిపారు.

తమ సంస్థ నిర్వహించిన ఉచిత హిందీ శిక్షణ తరగతులకు హాజరై పరీక్షల్లో పాల్గొన్న హిందీ పరిచయ్‌లో 84 మంది, ప్రాథమికలో ఒకరు, మధ్యమలో 7 గురు, రాష్ట్ర భాషలో 6 గురు, ప్రవేశికలో 6 గురు అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వీరిలో పలువురు డిస్టెన్స్‌లో కూడా ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

హిందీ పరీక్షల్లో శతశాతం అభ్యర్థులు ఉత్తీర్ణులు కావడంతో అభ్యర్థులు, కేంద్రం నిర్వాహకులకు ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు అభినందనలు తెలిపారు.

ఏప్రిల్ 20న ఫిల్మ్ క్లబ్ ఎన్నికలు

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్‌కు ఎట్టకేలకు ఎన్నికలు నిర్వహించడానికి కార్యవర్గం ముందుకువచ్చింది. ఈ నెల 6వ తేదీన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించింది. ఏప్రిల్ 20న ఎన్నికలు నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన వారు పోటీ చేయవచ్చునని ప్రకటించింది. ఇప్పటివరకూ ఈ క్లబ్‌కు అధ్యక్షునిగా వైసీపీ నాయకులు కాయల వెంకటరెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎస్ఆర్ షాపింగ్ మాల్ గోపీనాథ్‌రెడ్డి వ్యవహరించారు. మూడు నెలల క్రితం కోశాధికారి, అధ్యక్షులు ఒకరి తరువాత మరొకరు రాజీనామాలు సమర్పించారు. కానీ వాటిని ఆమోదించకుండా మిగిలిన కార్యవర్గం ఇన్ని రోజులు డ్రామా నడిపించుకుంటూ వచ్చింది. ఈ క్లబ్‌లో సభ్యత్వ రుసుము చెల్లించకుండా కొనసాగుతున్నవారే అన్నీ తామై నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. క్లబ్ సిబ్బందిపై ఆరోపణలు రావడంతో వారు కూడా ఉద్యోగాలకు రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఎమ్మెల్యేలతో పాటు దిగువ స్థాయి అధికారులకు కూడా ఉచిత సభ్యత్వం కల్పించడంపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఇకపై కూడా ఈ క్లబ్‌పై వైసీపీ పెత్తనమే కొనసాగేలా కొందరు పావులు కదుపుతున్నారని ప్రచారం జరుగుతోంది.

నిబంధనలు పాటించనందునే హయగ్రీవ భూములు వెనక్కి

» త్వరలో రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు » కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలు పాటించనందునే 'హయగ్రీవ'కు కేటాయించిన భూములు వెనక్కి తీసుకున్నామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ స్పష్టంచేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న భూములను 22-ఎలో చేర్చామని పేర్కొన్నారు. ఆ భూములు గతంలో 22-ఎలో లేకపోవడంతో సమస్యలు వచ్చాయన్నారు.

రుషికొండ బీచ్‌కు త్వరలో తిరిగి బ్లూ ఫ్లాగ్ హోదా లభిస్తుందని కలెక్టర్ అన్నారు. బీచ్‌లో సౌకర్యాల కల్పనపై దృష్టిసారించామన్నారు. బీచ్‌కు వెళ్లే సందర్శకులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రెండో వైపు రహదారి అందుబాటులోకి తెచ్చామన్నారు. బ్లూఫ్లాగ్ నిర్వహణ సంస్థతో ఎప్పటికప్పుడు సంప్రతింపులు చేస్తున్నామని తెలిపారు.

కొద్దిరోజుల్లో రుషికొండ బీచ్‌లో పూర్తిస్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

పోర్టులో మహిళా దినోత్సవం

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మహిళా విభాగం చేపట్టిన కార్యక్రమాలను ప్రశంసించారు. పోర్టు అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అరకు కాఫీ, మిల్లెట్స్ స్టాల్ ఏర్పాటు చేశారు. ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న ఉద్యోగులను సత్కరించారు. ఐగాట్ కర్మయోగి కోర్సులను పూర్తిచేసిన వారికి బహుమతులు అందజేశారు. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, దివ్య హరీంధర్ ప్రసాద్, పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పీఎస్ఎల్ స్వామి, న్యాయవాదులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పోర్టు చైర్మన్, అనకాపల్లి కలెక్టర్ తదితరులు

దండియాత్ర సదా స్ఫూర్తిదాయకం

చంద్రంపాలెం జడ్పీ పాఠశాలలో ఉప్పు సత్యాగ్రహంపై అవగాహన కార్యక్రమం

కొమ్మాది, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో బ్రిటీష్ పాలకులు 95 సంవత్సరాల క్రితం ఉప్పుపై వేసిన పన్నును నిరసిస్తూ గాంధీజీ చేపట్టిన ఉప్పుసత్యాగ్రహం స్ఫూర్తి నేటికీ మనకు ఆదర్శణీయమని చంద్రంపాలెంలోని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం గొట్టేటి రవి పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో బుధవారం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో దండియాత్రపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1930 మార్చి, 12న ఉప్పుసత్యాగ్రహం సబర్మతి ఆశ్రమం నుంచి ప్రారంభమై ఏప్రిల్ 6న గుజరాత్ తీరంలోని దండి చేరుకుని అక్కడ ఉప్పును తయారు చేసి గాంధీ బ్రిటిష్ శాశనాన్ని వ్యతిరేకించారని తెలిపారు. నాటి కార్యక్రమంలో గాంధీతో సహా అనేక మందిని అరెస్టు చేసినా ఉద్యమం ఆగలేదని భారత స్వాతంత్ర్య పోరాటంలో ఉప్పు సత్యాగ్రహం ఒక మైలురాయిలా నిలిచిందన్నారు. ప్రజల్లో మరింత స్వాతంత్ర్య ఆకాంక్షను రగిల్చిందని తెలిపారు. విద్యార్థులు సమాజ ప్రగతి కోసం దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు గాంధీ, ఇతర స్వతంత్రసమరయోధుల వేషధారణలో 'వందేమాతరం' నినదిస్తూ దండి యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు మోహనరావు, ధనలక్ష్మి, శంకర్, అన్నపూర్ణ, వరలక్ష్మి, పద్మావతి, స్వరాజ్యలక్ష్మి, లివింగ్స్టన్, శారద, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



నేతల వేషధారణలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కన్నుల పండువగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో సర్వాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి ఆగమోక్తంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు జరిపి మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ జీలకర్ర బెల్లం, మాంగల్యాధారణ చేశారు. అక్షితారోపణలు తరువాత స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చి భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఖాళీస్థలాలు, రైతులను హక్కుదారులుగా గుర్తించాలి : పాశర్ల ప్రసాద్

సింహాచలం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి పంచగ్రామాల భూసమస్యలో అంతర్భాగంగా ఉన్న రైతులను, ఖాళీ స్థలాల యజమానులకు హక్కుదారులుగా గుర్తించాలని 98వ వార్డు కాంగ్రెస్ పార్టీ నేత పాశర్ల ప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని అమరావతిలోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్య కారణంగా రైతులు, ఖాళీ స్థలాల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు.

టార్గెట్ ఒలింపిక్స్

... 5వ పేజీ తరువాయి

జ్యోతి పాల్గొంది. ఒలింపిక్స్‌లో పాల్గొన్న తొలి భారత మహిళ అథ్లెట్‌గా గుర్తింపుపొందింది. అనేక జాతీయ రికార్డులను సాధించింది. శనివారం ఇరాన్‌లో జరిగిన ఏషియన్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌లో 60 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. 60 మీటర్ల హర్డిల్స్ రేస్‌ను 8.12 సెకండ్లలో పూర్తిచేసి, గతంతో తాను నెలకొల్పిన జాతీయ రికార్డును తిరగరాసింది.

గత నెల డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ క్రీడల అథ్లెటిక్స్‌లో 100, 200 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకాలు సాధించి రాష్ట్ర కీర్తిని చాటింది. జాతీయ స్థాయి అథ్లెటిక్స్ మీట్స్‌లో ఇప్పటివరకూ 39 పతకాలు సాధించిన జ్యోతి ఎర్రాజీ...అంతర్జాతీయ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో తనదైన ఎక్స్‌ప్రెస్ వేగంతో అనేక పతకాలు సొంతం చేసుకుంది.

పేదల గృహ నిర్మాణానికి రూ.305.13 కోట్లు

... 5వ పేజీ తరువాయి

రూ.1.8 లక్షలు అని, దీనిలో భాగంగా ఆప్షన్-1 (లబ్ధిదారుడు సొంతంగా ఇళ్లు నిర్మించడం); ఆప్షన్ 2 (ప్రభుత్వం మెటీరియల్ ఇస్తే లబ్ధిదారుడు నిర్మించుకోవడం) కింద జిల్లాకు మంజూరైన 24 వేల ఇళ్లలో ఇంతవరకూ పూర్తి చేయని బీసీ/ఎస్సీ/ఎస్టీ వర్గాలకు చెందిన ఇళ్లు 8,619 ఉన్నాయన్నారు. వారందరికీ రూ.43.4 కోట్లు అదనపు సాయం అందుతుందన్నారు. అలాగే నగర శివారుల్లోని 65 లేఅవుట్‌లలో ప్రారంభించిన 1,14,805 ఇళ్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందినవి 63,963 ఇళ్లు ఉన్నాయన్నారు. వారికి రూ.321.73 కోట్లు సాయం అందుతుందన్నారు.

ఇళ్లు పూర్తిచేయడానికిగాను లబ్ధిదారుల ఖాతాలకు సొమ్ములు జమ చేస్తామన్నారు. ప్రభుత్వం అందించే సాయంతో ఇళ్లు పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు భూముల పరిశీలన

పద్మనాభం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం, రెడ్డిపల్లి గ్రామాల్లో పారిశ్రామిక (ఎంఎస్ఎంఈ) పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను బుధవారం జాయింట్ కలెక్టరు మయూర్ అశోక్ పరిశీలించారు. తహసీల్దారు కె.ఆనందరావుతో కలిసి ఆయన ఆయా గ్రామాల్లోని భూములను పరిశీలించారు. వాటి రికార్డులు, భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని అవకాశాలు కుదిరితే ఈ భూములను ఏపీఐఐసీకి బదలాయించి పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయిస్తారు. ప్రతీ నియోజకవర్గానికి ఒక పరిశ్రమల పార్కు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన మేరకు జేసీ పరిశీలించారు. మండల సర్వేయర్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, వీఆర్వోలు గోపి, రవి, అప్పలరాజు తదితరులు ఉన్నారు.



కృష్ణాపురం వద్ద ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులు

రామన్న సన్నిధానంలో వేదపండిత సదస్యం

సింహాచలం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై గంగధార సమీపాన కొలువుదీరిన సీతారామస్వామి సన్నిధానంలో సంప్రదాయబద్ధంగా వేదపండిత సదస్యం జరిగింది. ఈ ఏడాది ఫాల్గుణ శుద్ధ ఏకాదశి అనగా ఈ నెల 10న సీతారాముల వార్షిక తిరుకల్యాణం జరగ్గా, దానిలో అంతర్భాగంగా మూడోరోజైన బుధవారం వేకువన ప్రభాత సేవలను యథావిధిగా ముగించారు. దేవాలయ అర్చకులు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి నవబ్రహ్మలను ఆవాహనం చేసి ఉపచారాలు సమర్పించారు. పండితులు సామ, యజుర్వేద, రుగ్వేద, అధర్వణ వేదాలను, అధ్యాపకులు నాలాయిర దివ్యప్రబంధాలను పఠనం చేయగా, పండితులను ఆలయ అధికారులు సన్మానించారు.



పారాయణం చేస్తున్న పండితులు

మధురవాడలో 2 ఐకానిక్ ప్రాజెక్టులు

... 5వ పేజీ తరువాయి

ప్రణాళిక రూపొందించారు. ఇది కూడా లా కాలేజీ మార్గంలో ఐకానిక్ గ్రాండ్ సమీపాన 2.82 ఎకరాల్లో వస్తుంది. గేమింగ్‌కు మొగ్గు చూపే యువతను ఆకర్షించేలా వర్చువల్ రియాల్టీ, ఆగ్‌మెంటెడ్ రియాల్టీ, ఇంటరాక్టివ్ గేమింగ్ వంటి సాంకేతిక అంశాలతో దీనిని తీర్చిదిద్దుతారు. ఇవి వై, జెడ్, ఆల్ఫా తరాలకు చెందిన యువతను లక్ష్యంగా చేసుకొని నిర్మించనున్నారు. 360 డిగ్రీల ఇమ్మెన్సివ్ థియేటర్, మిక్స్‌డ్ రియాల్టీ ఎస్కేప్ రూమ్, యానిమేషన్ షో, వీఆర్ గేమింగ్ జోన్, అక్వేరియం వంటి ఉంటాయి. డ్రైవ్-ఇన్ ఫుడ్ జోన్, 24/7 కేఫ్‌లు, 3 స్టార్ హోటల్ నిర్మిస్తారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఉండే ఐటీ కంపెనీలు, అందులో పనిచేసే ఉద్యోగుల కుటుంబాల అవసరాల కోసం దీనిని డిజైన్ చేశారు.

కొత్త తరాలంటే...

'వై' జనరేషన్ అంటే...1981-1996 మధ్య పుట్టినవారు. 28 ఏళ్ల నుంచి 42 మధ్య వయసు కలిగినవారు. వీరిని మిలేనియల్స్ అని కూడా వ్యవహరిస్తున్నారు. వీరు టెక్నాలజీపై ఆసక్తితో పాటు వివిధ అంశాలపై అవగాహన కలిగి ఉంటారు.

'జెడ్' జనరేషన్ అంటే...1997-2012 మధ్య జన్మించినవారు. వీరి వయస్సు 11 నుంచి 26 ఏళ్ల మధ్య ఉంటుంది. ఇండిపెండెంట్‌గా, హైపర్-డిజిటల్‌గా ఉంటారు. స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియా, ఈ-కామర్స్‌తో అనుబంధం కలిగిన వారు.

'ఆల్ఫా' జనరేషన్ అంటే...2013-2025 మధ్య జన్మించినవారు. పదేళ్లలోపు వయస్సువారు.

డివైడర్ల ఆక్రమణ

తగరపువలస, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తగరపువలస ప్రధాన రహదారిలో డివైడర్లు నామమాత్రంగా మిగిలాయి. కొన్నిచోట్ల వీటిపై దుకాణాలు పెట్టుకున్నారు. మూగ జీవుల సంచారం కూడా ఎక్కువగా ఉంది. జీవీఎంసీ అధికారుల హెచ్చరికలు బేఖాతరు చేస్తున్నారు. రెండువైపులా వ్యాపార సముదాయాలు, కూరగాయాల సంత, ఇతర దుకాణాలు ఎక్కువగా ఉండటంతో ఈ రహదారి నిత్యం రద్దీగా కనిపిస్తుంది. వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి ఆదివారం ఈ రూటులో బస్సులు వెళ్లడానికి కూడా చాలా సమయం పడుతోంది. పాదచారులు రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతున్నారు. కూడలిలో ట్రాఫిక్ పోలీసులు ఉంటున్నా పట్టించుకోవడం లేదు. డివైడర్ల మధ్యలో మొక్కల పెంపకం చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందని కోరుతున్నారు.

ప్రాజెక్టుల నిర్మాణంలో డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం

జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ఎస్ఈ ప్రవీణ్‌కుమార్

సాగర్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): దేశంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగంలో ప్రాజెక్టుల ప్రాథమిక నివేదిక తయారు చేయడానికి డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.పవీణ్‌కుమార్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాతీయ రహదారులు, వంతెనలను పర్వత ప్రాంతాలు, దట్టమైన అడవుల నుంచి నిర్మించే సమయంలో క్షేత్రస్థాయిలో సర్వేను నిర్వహించడం కష్టమవుతున్నందున సర్వేలకు డ్రోన్లు ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ఏరియల్ సర్వేల ద్వారా పర్యవేక్షించడానికి డ్రోన్ పరిజ్ఞానం దోహదపడుతుందన్నారు. సివిల్ ఇంజనీరింగ్ నిపుణులు లభించడం కొరతగా ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వ ఇంజనీరింగ్ సర్వీసులలోకి ప్రవేశించి నైపుణ్యాలు చాటాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుని అవకాశాలను అందుకోవాలన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ముకుంద పూర్వ విద్యార్థులను సన్మానించారు.



సత్కారం పొందుతున్న పి.ప్రవీణ్ కుమార్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకే తల్లికి వందనం

సంక్షేమ సంఘం డిమాండ్

భీమునిపట్నం (రూరల్), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకాన్ని కుటుంబంలో ఉన్న ప్రతి విద్యార్థికి రూ15 వేలు చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరికాదని భీమిలి వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.నాయుడు, ఎం.ఆనందరావులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలా చేస్తే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదవరని అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చేరికలు పెరిగి రానున్న కాలంలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. విద్యారంగంలో సంస్కరణలు తీసుకు వస్తామని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటిస్తున్నారని, ఎన్ని సంస్కరణలు తీసుకు వచ్చినా పిల్లలు లేకపోతే ఉపయోగం ఉండదన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని వారు కోరారు.

విద్యార్థులు, కళాకారులకు చిత్రలేఖన పోటీలు

సాగర్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన స్వాభిమాన ఉత్సవాల్లో భాగంగా బుధవారం రుషికొండ గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు, కళాకారులకు చిత్రలేఖన పోటీలు జరిగాయి. గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ సహకారంతో జరిగిన ఈ పోటీలను ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డాక్టర్ రాణిమంద, గాయత్రీ విద్యాపరిషత్ ఆచార్య పి.వి.శర్మలు ప్రారంభించారు. పోటీలకు వివిధ ఐటీడీఏలు, జిల్లాల నుంచి విచ్చేసిన 250మందికి డాక్టర్ రాణి మంద అభినందించారు. చిత్రలేఖనం ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత బయటకు తీయవచ్చునన్నారు. ఆచార్య పి.వి శర్మ మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తే విజయాలు సాధించవచ్చన్నారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

వారపు సంతలో ట్రాఫిక్ నియంత్రణ

పద్మనాభం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పద్మనాభంలో ప్రతీ బుధవారం నిర్వహించే వారపు సంతను రోడ్డుకు ఆరు అడుగుల దూరంలోకి పోలీసులు మార్పించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'రహదారిపై వారపుసంత' శీర్షికన వచ్చిన వార్తకు సీఐ సీహెచ్ శ్రీధర్ స్పందించారు. రోడ్డుపక్కన వ్యాపారాలు చేస్తున్న వర్తకులతో మాట్లాడారు. సిబ్బందితో దగ్గరుండి దుకాణాలను మార్పించారు. దీంతో రోడ్డుపై రద్దీ తగ్గి వాహనాల రాకపోకలకు మార్గం సుగమమైంది.



దుకాణాలు జరపడంతో విశాలంగా కనిపిస్తున్న పద్మనాభం వారపు సంత రోడ్డు

వైసీపీ ఆవిర్భావ వేడుకలు



పద్మనాభంలో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

పద్మనాభం, తగరపువలస, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పద్మనాభం, తగరపువలస జీవీఎంసీ 2వ వార్డు జీరుపేటలో బుధవారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పద్మనాభం మండల పార్టీ అధ్యక్షుడు కె.లక్ష్మణరావు నాయకత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా తొలుత మాజీ సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేకు కోసి అందరికీ పంచిపెట్టారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ నిరంతరం ప్రజల్లో ఉండాలని నాయకులు నిర్ణయించారు. ఎంపీపీ కె.రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, నాయకులు ఆదిబాబు, శివరామకృష్ణ, అప్పారావు, శ్రీను, పద్దు, గోవిందు, సత్యనారాయణ పాల్గొన్నారు. జీరుపేటలో పార్టీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి నాయకత్వంలో కేకు కోసి కార్యకర్తలకు, స్థానికులకు పంచారు. కూటమి ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారని వెంకటరెడ్డి అన్నారు.

స్వయం ఉపాధికి ఊతం

... 5వ పేజీ తరువాయి

అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు (కాపు, తెలగ, బలిజ, ఒంటరి) కులాలకు చెందిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. రుణాలకుఈ నెల 22వ తేదీలోగా ఆఇఖీ/జ్ఞి ఇ://ౖఇౌఛుురుట్బఇఛిజటుజీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యవసాయం, అనుబంధ, రవాణా, పరిశ్రమలు, సేవలు, వ్యాపార రంగాల్లో స్వయం ఉపాధి పొందేందుకు సబ్సిడీపై రుణాలు అందిసామన్నారు. అలాగే, బీఫార్మసీ/డీ.ఫార్మసీ పూర్తి చేసిన నిరుద్యోగ బీసీ, ఈబీసీ యువతకు జనరిక్ ఔషధ దుకాణాల ఏర్పాటుకు రుణాలు అందించనున్నట్టు వెల్లడించారు. మేదర, కుమ్మరి/ సాలివాహన వృత్తి చేస్తున్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తా మన్నారు. కాగా, ఇందులో 50 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోందని, మరో 50 శాతం బ్యాంకు రుణంగా మంజూరు చేస్తుందని అధికారులు చెబుతున్నారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని కార్పొరేషన్లకు ప్రభుత్వం 2,313 యూనిట్లను మంజూరుచేసింది. ఇందులో సబ్సిడీ రూ.27.21 కోట్లు, బ్యాంకు రుణం రూ.27.21 కలిపి మొత్తం రూ.54.44 కోట్లు. అలాగే, బీసీ సంక్షేమ శాఖ పరిధిలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కొద్ది రోజుల కిందట దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేశారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఆర్య వైశ్య, రెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ల పరిధిలోని మహిళలకు ఉచితంగా మూడు కేటగిరీల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నారు. ఆయా కార్పొరేషన్ల పరిధిలో 3,596 మంది లబ్ధిదారులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు ఖరీదైన కుట్టు మిషన్లను అందించనున్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ పరిధిలోని లబ్ధిదారులకు ఇదే తరహాలో సబ్సిడీతో కూడిన రుణాలు అందించేందుకు మరో వారం రోజుల్లో ఉత్తర్వులు వెలువడతాయని అధికారులు చెబుతున్నారు.

మరిన్ని పథకాలు..

గతంలో మాదిరిగా సంక్షేమ శాఖలను పూర్తిగా గాడిన పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వందలాది మంది నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రతి నెలా స్టైపెండ్ అందిస్తోంది. అలాగే యువత స్వయం ఉపాధి పొందేలా గతంలో మాదిరిగా వివిధ రకాల వాహనాలు అందించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు చెబుతున్నారు. కొద్దిరోజుల్లోనే వీటికి సంబంధించిన విధి, విధానాలు వెలువడతాయని అధికారులు చెబుతున్నారు. ఇంకా కోళ్ల పెంపకం, దుకాణాల ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించనున్నట్టు అధికారులు వెల్లడించారు.



సాయినాథునికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ముగిసిన సాయినాథుని ఆలయ వార్షికోత్సవాలు

పెదగంట్యాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సమతానగర్‌లో నాలుగు రోజుల పాటు జరిగిన షిర్డీసాయి శాంతిధామం ఆలయ వార్షికోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయం ఐదు గంటలకు సాయినాథునికి కాగడా హారతి ఇచ్చాక ఏకాదశ రుద్రాభిషేకం, మహా కుంభాభిషేకం, మధ్యాహ్న హారతి చేపట్టారు. జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు సాయినాథునికి క్షీరాభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. సాయంత్రం పరసలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్ర మంలో సేవక్ కమిటీ ప్రతినిధులు కొల్లి సత్యంబాబు, రవిశేఖర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తొలి ఘటాల మహోత్సవం

అగనంపూడి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక, ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడిమాంబ తొలి ఘటాల మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానికంగా గల పూజారి ఇంటి నుంచి ప్రత్యేక పూజలు చేసి తొలి ఘటాలను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు ఘటాలను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఘటాలను పురవీధుల్లో భజనలు, చిడతలు, పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. ఈ నెల 17న కోటి దీపాల జాతర, 18న అమ్మవారి అనుపోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

అగనంపూడి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా లీ ఫార్మా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు బుధవారం స్థానిక సీడబ్ల్యూసీ ప్రాంగణంలో 77, 79, 85 వార్డుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన సంస్థ డైరెక్టర్ ఆళ్ల లీలాజ్యోతి మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో విశిష్ట సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులకు వైద్య సేవలందించాలని భావించి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆమె కార్మికులకు పోషకాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఇల్లపు ప్రసాద్, బి.సత్యనారాయణ, బండారు చందూరమేశ్, జి.అప్పారావు, పదమ, రామకోటి, శానటరీ ఇన్‌స్పెక్టర్ బి.సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం** : సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా** : శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్** : జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్** : శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం** : మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్** : శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్** : మెలోడీ, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 16, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 42, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 38, బంగాళదుంపలు 16, అరటికాయ6, మునక్కాడలు (కిలో) 60, అల్లం 50, బరబాటి 36, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోసకాయలు 26, వెల్లుల్లి105, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 58, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176

కమిటీ ఏర్పాటులో ఆంతర్యమేమిటో.!

- కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియపై ఎటూ తేల్చని ఉక్కు యాజమాన్యం
- తీవ్ర ఆందోళనకు గురవుతున్న కార్మికులు



ఉక్కుటౌన్‌షిప్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో మంగళవారం జరిగిన చర్చల్లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియపై ఉక్కు యాజమాన్యం ఎటూ తేల్చకుండా ఈ అంశంపై కమిటీ వేస్తామని స్పష్టం చేయడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని కార్మికులు భయాందోళన చెందుతున్నారు.

కాంట్రాక్టు కార్మికుల్లో 30 శాతం మందిని తొలగించాలని ఉక్కు యాజమాన్యం భావించింది. ఈ క్రమంలో గతంలో 2,400 మందిని తొలగించడంతో తీవ్ర స్థాయిలో నాయకులు, కార్మికులు ఉద్యమించడంతో ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. తాజాగా మళ్లీ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియ మొదలుపెట్టింది. దీంతో కార్మిక నాయకులు యాజమాన్యంతో చర్చించి, ఈ ప్రక్రియను నిలిపివేయకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని, నిరవధిక సమ్మెకు దిగుతామంటూ నోటీసు ఇచ్చారు. ఈ క్రమంలో మంగళవారం ఆర్‌జేసీఎల్ సమక్షంలో కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు, ఉక్కు యాజమాన్యం మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అంశంపై కమిటీ వేస్తామని యాజమాన్యం పేర్కొంది. అంతేగానీ తొలగింపు ప్రక్రియను నిలిపివేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వలేదు. ఏ ఒక్క కార్మికుడిని తొలగించవద్దని కార్మిక నాయకులు డిమాండ్ చేయగా, తొలగింపు విధి, విధానాలపై కమిటీ వేస్తామని చెప్పడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని పలువురు కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగుల తొలగింపే లక్ష్యంగా యాజమాన్యం ఉందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే సుమారు 1,130 మంది ఉద్యోగులను వీఆర్ఎస్ ద్వారా బయటకు పంపనున్నది. ఇప్పుడు కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అంశంపై యాజమాన్యం తర్జనభర్జన పడుతుంది. ఇదిలావుండగా ఆర్ఎల్‌సీ సమక్షంలో మరోసారి ఉక్కు యాజమాన్యం, కార్మిక నాయకుల మధ్య ఈ నెల 26న చర్చలు జరగనున్నాయి. ఏదిఏమైనా కార్మికుల తొలగింపు ప్రక్రియను నిలిపివేస్తామని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో ఏ క్షణమైనా తమపై వేటుపడే ప్రమాదం ఉందని కార్మిక వర్గం ఆందోళన వ్యక్తం చేస్తుంది.

జూన్ నెలాఖరులోగా గృహ సముదాయాలకు వసతులు

- టిడ్కో ఈఈ సుధాకర్



టిడ్కో గృహాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న సుధాకర్

పెదగంట్యాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహ సముదాయాలకు జూన్ నెలాఖరులోగా పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని టిడ్కో ఈఈ సుధాకర్ పేర్కొన్నారు. పెదగంట్యాడ, బానోజీతోటల్లోని టిడ్కో గృహసముదాయాలను టిడ్కో, టాటా ప్రాజెక్టు అధికారులు బుధవారం పరిశీలించారు. అనంతరం వారు టిడ్కో గృహ సముదాయాల్లో ఉన్న సమస్యల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సుధాకర్ మాట్లాడుతూ వారం రోజుల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులను ప్రారంభిస్తామన్నారు. మూడు నెలల్లో రోడ్లు, డ్రైనేజీల కనెక్టివిటీ, విద్యుత్, తాగునీటి సౌకర్యాలను కల్పించేందుకు పనులు ప్రారంభిస్తామన్నారు.

సీపీఐ 'గాజువాక' కార్యదర్శి కె.సత్యనారాయణ లబ్ధిదారుల ప్రతినిధిగా మాట్లాడుతూ టిడ్కో గృహాలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించి నివాసయోగ్యంగా మార్చాలని అధికారులను కోరారు. టిడ్కో డీఈ రాజేశ్, టాటా ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎ.శ్రీనివాసరావు, మేనేజర్ రాజబాబు, సీపీఐ నాయకుడు జి.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యను పరిష్కరించాలి

అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే 'పల్లా'



గాజువాక, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అసెంబ్లీలో బుధవారం ప్రస్తావించారు. ప్రధానంగా ఏపీఐఐసీ ఏర్పాటు కోసం 1967 నుంచి తుంగ్లాం పరిసర ఏడు గ్రామాలకు చెందిన రైతుల నుంచి ప్రభుత్వం భూములు సేకరించింది. జనాభా పెరిగితే నిర్వాసితుల భవిష్యత్తు అవసరాల నిమిత్తం వారికి ఇచ్చేందుకు కొంత భూమిని కేటాయించారు. అయితే ఏళ్లు గడుస్తున్న ఇప్పటికీ నిర్వాసితులకు భూములను కేటాయించలేదని, ప్రస్తుతం నిర్వాసితులకు చెందిన ఐదో తరం ఉందని, వారికి లీగల్ హైర్ ఎలా వస్తుందని పల్లా పేర్కొన్నారు. ఇందుకోసం కోసం గ్రామ సభలు పెట్టాలని నిర్ణయించినా అమలుకు నోచుకోలేదని, ప్రభుత్వం తమకు ఎప్పుడు భూములను కేటాయిస్తుందా అని ఏపీఐఐసీ నిర్వాసితులు ఎదురుచూస్తున్నారని, వారికి తక్షణమే న్యాయం చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గ పరిధిలో వాగులు, వంకల్లో ఎన్నో ఏళ్ల క్రితం ప్రజలు ఇళ్ల నిర్మాణం చేపట్టారని, ఆక్రమిత భూముల్లో ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీవో ఇచ్చిందని, ఈ క్రమంలో కొంతమందికే పట్టాలు ఇచ్చిందని, ఇంకా చాలామందికి ఇవ్వాల్సి ఉందన్నారు. అందువల్ల పబ్లిక్ గ్రీవెన్స్ లిటరేటర్ సిస్టమ్‌ను ప్రామాణికంగా తీసుకొని ప్రతి అర్జీని పరిష్కరించాలని, దీంతో దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభిస్తుందని పల్లా శ్రీనివాసరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి సబ్ కమిటీని వేయాలని కోరారు.

కిడ్నీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అక్కిరెడ్డిపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధులను సకాలంలో గుర్తించి సరైన చికిత్స అందజేస్తే పూర్తి స్థాయిలో నివారించవచ్చని ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ రమ్య వేదుల అన్నారు. షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో బుధవారం కిడ్నీ వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత యాంత్రిక యుగంలో మారిన జీవనశైలితో పాటు ఆహారపు అలవాట్ల వల్ల కిడ్నీ వ్యాధుల బారినపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు అధికమవుతుందన్నారు. అందువల్ల ఆహార విషయంలో అందరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టీఎల్‌లో ముగిసిన భద్రతా వారోత్సవాలు



భద్రతా ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎస్‌టీఎల్ అధికారులు, సిబ్బంది

గోపాలపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌టీఎల్‌లో జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపోత్సవం బుధవారం జరిగింది. డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్‌టీఎల్‌లో భద్రతా అంశాలను బలోపేతం చేయడానికి పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పని ప్రదేశంలో భద్రత ప్రాముఖ్యతపై సూచనలిచ్చారు. గౌరవ అతిథి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేశ్ మాట్లాడుతూ కర్మాగారాల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎన్ఎస్‌టీఎల్ సేఫ్టీ హెడ్, సైంటిస్ట్-ఎఫ్ ఎస్.రవికుమార్ మాట్లాడుతూ ఎన్ఎస్‌టీఎల్ జీరో యాక్సిడెంట్, జీరో ఇన్సిడెంట్ ఇండస్ట్రీ అన్నారు. వారోత్సవాల సందర్భంగా భద్రతా నడక, భద్రతా క్విజ్, భద్రతా ప్రసంగం, భద్రతా మాక్ డ్రిల్, భద్రతా అగ్నిమాపక శిక్షణ, ప్రథమ చికిత్స వస్తుసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌వీ రమణబాబు (ఏజీఎం, బీడీఎల్) జీవీ రామకృష్ణమ్మ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఏవో), డాక్టర్ టీఆర్ జ్యోత్స్న (హెచ్‌వోడీ ఎలక్ట్రికల్ విభాగం, ఏయూ), భారత నౌకాదళ అధికారి కేవీఆర్ రెడ్డి, ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు, అధికారులు, సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు, వర్క్స్ కమిటీ సభ్యులు, ఎన్ఎస్‌టీఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు పెందుర్తి సమన్వయకర్తలు



సోమశేఖర్‌నాయుడు, సింహాచలం

పెందుర్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 14న పిఠాపురంలో జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభకు పెందుర్తి నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులుగా చినముషిడివాడకు చెందిన పార్టీ కార్యదర్శి అయితి సింహాచలం నాయుడు, 97వ వార్డు జనసేన అధ్యక్షుడు సేనాపతి సోమశేఖర్‌నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆధ్వర్యంలో భారీగా కార్యకర్తలను సమీకరించి సభను విజయవంతం చేస్తామన్నారు.

శంకర్ ఆస్పత్రికి మైక్రోస్కోప్ బహూకరణ



ఆస్పత్రికి అందించిన మైక్రోస్కోప్

వేపగుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి సౌత్ ఏసియా ఎల్‌జీ కంపెనీ సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా బుధవారం మైక్రోస్కోప్‌ను అందజేశారు. సంస్థ సీఈఓ నవీన్ మళీజా మాట్లాడుతూ పేదలకు ఉపయోగపడేలా రూ.60 లక్షల ఖరీదైన యంత్రం అందించామన్నారు. సంస్థ సీఎఫ్‌వో వికాస్ వర్మ, మేనేజర్ కె.రాధాకృష్ణ, కృష్ణకుమార్, డీజీఎమ్ బంగ్రారాజు, వేణుగోపాల్, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఎన్ఏడీ జంక్షన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విమాన్‌నగర్‌లో కాలనీ అసోసియేషన్ భవనం అదనపు అంతస్తు నిర్మాణానికి కార్పొరేటర్ బొమ్మిడిరమణ బుధవారం శంకుస్థాపన చేశారు. రూ. 41.5 లక్షలతో పనులు చేపడతారన్నారు. ఏఈ వెంకటలక్ష్మి, రామకృష్ణ, పాల్గొన్నారు.

'పది'లో మంచి మార్కులు సాధించాలి



విద్యార్థికి హాల్‌టికెట్, సామగ్రి అందిస్తున్న దృశ్యం

మల్కాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ అధినేత కోరాడ శ్రీనివాసరావు ఊచించారు. ట్రస్ట్ సమకూర్చిన పరీక్ష అట్టలు, ఇతర సామగ్రిని బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్యసింహ మాట్లాడుతూ పదిలో ఉత్తీర్ణత శాతం పెరగాలన్నారు. హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైటింగ్ ప్యాడ్‌లు పంపిణీ

వేపగుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో 168 మంది విద్యార్థులకు సాయిదీవన కార్యక్రమం కింద విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, పెన్, ఇతర సామగ్రిని సుజాతానగర్ సాయి సేవపీఠం ఆర్థిక సహాయంతో అందజేశారు. కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు హెచ్‌ఎం మహేష్, ఎం.గోపి, శ్రీనివాసరావు, రవిశంకర్, సీతారామయ్య, వైకుంఠరావు పాల్గొన్నారు.

97వ వార్డులో హైమాస్ట్ వెలుగులు

పెందుర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 97వ వార్డు ద్రోణంరాజుకాలనీ, కుమ్మరకాలనీ, సింహాద్రినగర్‌లో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను బుధవారం కార్పొరేటర్ సేనాపతి వసంత ప్రారంభించారు. వార్డు పరిధిలో అన్ని కాలనీ ముఖ్య కూడళ్లలో హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సేనాపతి శంకరరావు, అవగడ్డ అప్పలనాయుడు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన

- ఆర్డీవోకు గోడు వినిపించేందుకు తరలి వచ్చిన రైతులు
- ప్రైవేటు భూములు లేవన్న అధికారి



బ్రిడ్జి నిర్మాణ ప్రాంతంలో ఆర్డీవో, ఇతర అధికారులు

పెందుర్తిరూరల్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): అదనపు ట్రాక్ నిర్మాణంలో భాగంగా ఆంధ్రా సిమెంట్స్ నుంచి చింతలఅగ్రహారం వరకు రైలు వంతెన నిర్మాణానికి సేకరించాల్సి భూములను రెవెన్యూ, రైల్వే, సింహాచలం దేవస్థానం అధికారులు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో శ్రీలేఖకు గోడు వినిపించేందుకు భూములు కోల్పోతున్న రైతులు తరలి వచ్చారు. అయితే అధికారులు స్పందించకపోవడంతో ఆవేదనకు గురయ్యారు. అధికారులు వస్తున్నారనే సమాచారంతో పోర్లుపాలెం రైతులు వీరాంజనేయస్వామి ఆలయ సమీపంలో ఆందోళన శిబిరం ఏర్పాటు చేశారు. ఆర్డీవోతో పాటు ఇతర శాఖల అధికారులు ఆగకుండా వెళ్లిపోయారు. చింతలఅగ్రహారం రైల్వే గేటు వద్ద చుట్టుముట్టడంతో ఆర్డీవో శ్రీలేఖ అసహనానికి గురయ్యారు. ఇవి ప్రభుత్వ భూములని, రైతులకు సంబంధం లేదన్నారు. వంతెన నిర్మిత ప్రాంతాన్ని రైల్వే అధికారులు మ్యాపు ద్వారా ఆర్డీవోకు వివరించారు. అభ్యంతరాలుంటే తహసీల్దారు కార్యాలయంలో ఇవ్వాలని ఆర్డీవో రైతులకు వివరించారు. తహసీల్దార్ ఆనందకుమార్, వీఆర్వోలు ముత్యాలుశెట్టి, శివ, రైతు సంఘాల ప్రతినిధులు గల్లా వెంకటరమణ, పెంటకోట రమణ, కొణతాల సూర్యనారాయణ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం

వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగప్రసాద్, ఐలా మాజీ చైర్మన్ వై.సాంబశివరావు



మాట్లాడుతున్న సజ్జా పాండురంగ ప్రసాద్

ఆటోనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ కార్మికులు, షెడ్ల నిర్వాహకులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన జీవోలు-5,6లను నిలుపుదల చేయడం హర్షణీయమని వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగప్రసాద్, ఐలా మాజీ చైర్మన్ యార్లగడ్డ సాంబశివరావులు పేర్కొన్నారు. ఆటోనగర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జీవో నంబర్-41ను తెచ్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం జీవో నంబర్-5, 6లను తెచ్చి ఆటోనగర్‌లో ప్లాట్లను మార్కెట్ విలువలో 50 శాతం ఇంపాక్ట్ ఫీజు, ఇతర చార్జీలను చెల్లించి కమర్షియల్‌గా మార్చుకోమంటూ పారిశ్రామికవేత్తలపై ఒత్తిడి తెచ్చిందనిపేర్కొన్నారు. లేకుంటే స్థలంలో 50 శాతం ప్రభుత్వానికి అప్పగించాలని, మిగిలిన స్థలాన్ని ప్రభుత్వం కమర్షియల్‌గా మారుస్తుందని నోటీసుల ద్వారా పారిశ్రామికవేత్తలపై తీవ్ర ఒత్తిడి తెచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు పారిశ్రామిక ప్రగతి కోసం 41 జీవోను ప్రకటించడంతో పాటు అభివృద్ధికి ఆటంకంగా ఉన్న 5,6 జీవోలను రద్దు చేయడంతో పారిశ్రామికవేత్తలు ఊపిరి పీల్చుకున్నారన్నారు. పారిశ్రామికవేత్తలు ఎన్.శేషగిరిరావు, సుబ్బారావు, రామ్‌ప్రసాద్, ప్రభాకర్, లంక బాపిరాజు, కృష్ణప్రసాద్, డి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ఆర్యవైశ్యుల అభినందనలు

కూర్మన్నపాలెం: ఈ నెల 16న అమరజీవి పొట్టి శ్రీరాములు జయంత్యుత్సవాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల 87వ వార్డుకు చెందిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో ఏపీ ఆర్యవైశ్య మహాసభ హెల్త్ అండ్ మెడికల్ చైర్మన్ కారుమూరి మహేశ్ సంఘ సభ్యులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు జడ్జీ బీఆర్ఎస్ శేషాద్రిని కలసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంఘ సభ్యులు ఎం.వెంకటరమణ, వీర్రాజు, బి.పెంటబాబు, సతీశ్, కృష్ణారావు, అప్పల సత్యనారాయణ గుప్తా, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు రోడ్డులో దోపిడీ

- లారీ డ్రైవర్లను కత్తితో బెదిరించి రూ.3,500 నగదు, రెండు సెల్ ఫోన్లతో ఉడాయించిన దుండగులు

గాజువాక, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): లారీలో నిద్రిస్తున్న డ్రైవర్లను కత్తితో బెదిరించి, దాడి చేసి దోపిడీకి పాల్పడిన సంఘటన బుధవారం వేకువజామున గంగవరం పోర్టు రోడ్డులో చోటుచేసుకుంది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన అభిశంత్, జార్ఖండ్‌కు చెందిన ఇంతిజ్ అన్సారీలు గంగవరం పోర్టు రోడ్డులో మంగళవారం రాత్రి తమ లారీలను నిలిపివేసి ఎవరి వాహనంలో వారు నిద్రించారు. అయితే వేకువజాము నాలుగు గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి కత్తితో వారిని బెదిరించి, వారి వద్దనున్న రూ.3,500 నగదు, రెండు సెల్ ఫోన్లను లాక్కుని పారిపోయారు. దీంతో ఆ ఇద్దరు డ్రైవర్లు గాజువాక క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ సంఘటనకు సంబంధించి అప్పికొండ, మదీనాబాగ్ ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

అదానీ పోర్టులో భద్రతా వారోత్సవాలు

గాజువాక, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టులో బుధవారం జాతీయ భద్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు ప్రతినిధులు మాట్లాడుతూ భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, భద్రతతో పాటు పరిసర ప్రాంతాల ప్రజల సుఖమైన జీవనం కోసం మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. గంగవరం ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు.

సమస్యలపై పోరాటం: మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్



వైఎస్ విగ్రహం వద్ద అదీప్‌రాజ్, నాయకులు

పెందుర్తి/ అక్కిరెడ్డిపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన నిలిచి సమస్యలపై వైసీపీ నిరంతర పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెందుర్తిలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వైసీపీ జెండాను ఆవిష్కరించారు. కేకును కత్తిరించారు. అనంతరం కూడలిలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు శరగడం చినఅప్పలనాయుడు, దేవిసాంబ, కనకరాజు, చందుయాదవ్, మహేశ్, దేవుడు పాల్గొన్నారు. అలాగే మిందిలో వైఎస్ విగ్రహానికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుడివాడ లతీశ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మల్కాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. హరిజనవీధి, గాంధీజీవీధి, రజకవీధి, జాలారివీధి, శెట్టిబలిజవీధి, పల్లివీధి, నగరాల వీధి, ఏడుగుళ్లు, వెంకన్నపాలెం, ఏకేసీ కాలనీ, కాకరలోవ జీవీఎంసీ పంప్‌హౌస్, ఈఎస్ఐ ఆస్పత్రి, ఐఎంయూ, సీఈఎంఎస్, సింధియా జంక్షన్, పోస్ట్ఆఫీస్, మసీద్, ఎంఎస్ఆర్ బిల్డింగ్, ఎయిర్‌పోర్టు, రాడర్, లైట్‌హౌస్, యారడ కొండ, గ్రామం, కాకరలోవ, జయంద్రకాలనీ, క్రాంతినగర్, బీపీసీఎల్ గోడౌన్, వై-జంక్షన్, డాక్‌యార్డు ఏరియా, నవయుగ, ఈ ఐపీఎల్, ఆయిల్ ఓర్పా ఏరియా, శాతవాహన్ బస్‌స్టాప్, ఐఎన్‌హెచ్‌ఎస్ కళ్యాణి ఆస్పత్రి, టెంపుల్ ఏరియాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

గోపాలపట్నం పరిధిలో...

గోపాలపట్నం: నిర్వహణలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఇందిరానగర్, నర్సింహనగర్, గోపాలపట్నం బంక్ ఏరియా, లక్ష్మీనగర్ ఈ-బ్లాక్, ఎఫ్-బ్లాక్, ఎన్ఏడీ కొత్తరోడ్డు, గాంధీనగర్, రెడ్డి వీధి, గవర వీధి, సుసర్లాకాలనీ, సీతారామరాజు నగర్, కొత్తపాలెం, నాగేంద్రకాలనీ, సంతోష్‌నగర్, సూర్యనగర్, డీఏఆర్ నగర్, ఖారవేలనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ ఉండదని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.

పంట నమోదుతో రైతులకు ప్రయోజనం

పెందుర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పంట నమోదు ప్రక్రియతో రైతులకు ప్రయోజనమని జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు అన్నారు. రాంపురంలో బుధవారం వ్యవసాయాధికారులు రబీ కాలానికి పంట నమోదు ప్రక్రియ నిర్వహించారు.ఇందులో పాల్గొన్న ఆయన యాప్‌లో పంట నమోదు ప్రారంభించారు. బంగారునాయుడు, జగన్ పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం

పెందుర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నిస్సహాయ స్థితిలో వున్న వృద్ధురాలికి పోలీసులు ఆసరా కల్పించారు. వృద్ధాశ్రమంలో చేర్పించి భరోసా ఇచ్చారు. వేపగుంట సింహపురి కాలనీకి చెందిన అక్కినేని వరలక్ష్మి(65) ఒంటిరిగా నివస్తున్నారు. బంధువులు ఎవరూ లేక పోవడం, అనారోగ్యానికి గురవడంతో చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. దీంతో సీఐ కేవీ సతీశ్‌కుమార్ పోలీసుల సాయంతో లయోలా వృద్ధాశ్రమంలో చేర్పించారు.

ఘనంగా దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

గోపాలపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బంటాకాలనీ అభయాంజనేయ స్వామి, గణపతి సహిత దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ బెహరా భాస్కరరావు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు ముత్యాలమ్మవారి పండగ

వేపగుంట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలమ్మ పండగ గురువారం జరగనుంది. ఉదయం 4 గంటల నుంచి ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులు వెండి ఆభరణాలు, తాళి బొట్టు బహూకరించారు.

14న నూకాంబిక ఆలయ వార్షికోత్సవం



బర్మాక్యాంప్‌లో నూకాంబిక అమ్మవారు

మురళీనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బర్మాక్యాంప్‌లో నూకాంబిక అమ్మవారి ఆలయ వార్షికోత్సవాల్ని ఈ నెల 14న నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 6 గంటల నుంచి ప్రజలు నేరుగా పాలాభిషేకం, పంచామృత, జలాభిషేకాలు జరుపుకొనే అవకాశం కల్పిస్తారు. పరిసర గ్రామాల ప్రజలు బిందెలతో పసుపు నీటిని తెచ్చి అమ్మవారికి అభిషేకం చేస్తారు. భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరు కావాలని అర్చకుడు బుచ్చిబాబు శర్మ కోరారు. ఈఓ పర్యవేక్షణలో ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు.

ధ్రువపత్రాల పంపిణీ రేపు

అక్కయ్యపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) వ్యవస్థాపకుడు కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య (మాస్టర్ ఈకే) 41వ ఆరాధన దినోత్సవం సందర్భంగా పూజాది క్రతువులను జగద్గురు పీఠం సోదర బృందం నిర్వహించనుంది. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో జనశిక్షణ సంస్థాన్, జగద్గురు పీఠం మూడు నెలలపాటు సంయుక్తంగా నిర్వహించిన బ్యుటీషియన్, ఎంబ్రాయిడింగ్ కోర్సులలో ఉత్తీర్ణులైన 60 మంది మహిళలకు కేంద్ర ప్రభుత్వ సంబంధిత స్కిల్ ఇండియా వారి ధ్రువపత్రాలను ఈ నెల 14న అందించనున్నట్లు జగద్గురు పీఠం ప్రతినిధి అజ్జరపు శ్రీనివాస్ తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కార్యక్రమంలో పాల్గొన్న శ్యామలా దీపిక, ఇతర నాయకులు, స్థానికులు

అక్కయ్యపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు జగన్నాథపురం మూడు గుళ్ల జంక్షన్‌లో రూ.19 లక్షలతో డ్రైనేజీలు, కవర్ స్లాబ్స్, ఫుట్‌పాత్ టైల్స్ నిర్మాణానికి బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక బుధవారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ వార్డు అభివృద్ధికి ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, ఏఈ రమణమ్మ, డీఈఈ రామసుబ్బారావు, కూటమి నాయకులు అకిరెడ్డి జగదీష్, బొడ్డేటి మోహన్, గురుగోవింద్ సింగ్, వెంకటరమణారావు, ఎంఎల్ఎన్ రావు, తోట శ్రీదేవి పాల్గొన్నారు.

పురుషులలో సంతానలేమిపై అవగాహన కార్యక్రమం

మహారాణిపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పురుషులలో సంతానలేమి సమస్యలపై బుధవారం ఓమ్ని ఆసుపత్రి ప్రాంగణంలో అవగాహన కల్పించారు. పురుషులలో 10 నుంచి 20 శాతం మందికి సంతాన లేమి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని నిర్ధారించారు. శస్త్రచికిత్సలు, అధునాతన వైద్య విధానంతో సత్ఫలితాలు ఉంటాయని యూరాలజిస్టులు, ఆండ్రాలజిస్టులు వివరించారు. ఎండీ డాక్టర్ రాధాకృష్ణ ప్రారంభించిన కార్యక్రమంలో వైద్యులు సతీష్‌బాబు, ఎస్.శ్రీదేవి పాల్గొన్నారు.

వీధికుక్కల పట్టివేత



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

కంచరపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కొండవాలు గ్రామాల్లో వీధి కుక్కల బెడదపై అధికారులు చర్యలు చేపట్టారు. కార్పొరేటర్ గంకల కవిత రెండు రోజుల క్రితం కుక్కల బెడదపై మేయర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన మేయర్ కుక్కలను పట్టుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఈ ప్రాంతంలో కుక్కలను పట్టుకుని తరలించారు. ప్రతి వారం వచ్చి కుక్కల సమస్య లేకుండా చేస్తామని అధికారులు తెలిపారు. గతంలో కుక్కకాటుకు గురై చాలా మంది ఆసుపత్రి పాలయ్యారు. కార్పొరేటర్ కవితను ప్రజలు అభినందించారు.

లైంగిక దాడులను అరికట్టాలి

సీతంపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, మహిళలపై లైంగిక దాడులు, సామాజిక మూలాలు అనే అంశంపై ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో పీడీఎస్‌ఓ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శైలజ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ తదితరులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న అత్యాచార ఘటనలు అందరినీ తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. స్త్రీని ఒక మనిషిగా గుర్తించి సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్.భాను, ఎస్.భాస్కర్, పి.విశ్వనాథ్, రాజేష్, సతీష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



తాటిచెట్లపాలెం - రైల్వేస్టేషన్ రోడ్డులో అలముకున్న చీకటి



ఇదే రోడ్డులో బుధవారం రాత్రి స్తంభించిన వాహన రాకపోకలు

ఆ రహదారిలో చీకటిపడితే అంధకారమే!

» తాటిచెట్లపాలెం - రైల్వేస్టేషన్ రోడ్డులో వెలగని వీధి లైట్లు

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్ర జ్యోతి): నగరంలో ఎక్కడికక్కడ వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం అలముకుంటోంది. చీకటి పడిన తరువాత తాటిచెట్లపాలెం జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డులో వెళ్లాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. ఆ రోడ్డులో ఇరువైపులా వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రివేళ గాఢాంధకారం అలముకుంటోంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. అదే సమయంలో చీకటిగా ఉండడంతో వాహనచోదకులు అయోమయానికి గురవుతున్నారు. ఇతర వాహనాల కదలికలను అంచనావేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదంటున్నారు.

క్లస్టర్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

కంచరపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన క్లస్టర్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు మంగళవారం జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. క్లస్టర్ పరిధిలోని 6 ప్రాథమిక, ఒక ఉన్నత పాఠశాలలకు చెందిన 52 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి డి.దివాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ మారుతున్న సాంకేతికత నేపథ్యంలో ఉపాధ్యాయులు కూడా తగిన తర్ఫీదు పొంది పాఠ్యాంశాలు బోధించాలన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలలో చదవడం గొప్ప అవకాశం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ నాయకురాలు ఫణిగాయత్రి

డాబాగార్డెన్స్ మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడం గొప్ప అవకాశంగా భావించాలని, ఎందరో గొప్ప వ్యక్తులు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అభ్యసించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం జీవీఎంసీ పరిధి 31వ వార్డు రమాదేవి భానోజీరావు పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా టీడీపీ నాయకురాలు వానపల్లి గాయత్రిఫణికుమారి, ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్, కార్పొరేటర్ జైన్ హాజరయ్యారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి స్థాయిలో నిలవాలని వక్తలు ఆకాంక్షించారు. గురువులు, తల్లిదండ్రులపై గౌరవంతో మెలగాలన్నారు. జీవితంలో ఏం కావాలనుకుంటున్నారో, ఇప్పటి నుంచే కలలుగంటూ దానిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ వేషధారణలతో విద్యారులు సందడి చేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న చర్చాగోష్ఠి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ డి.వి. సూర్యారావు

సీతంపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ప్రిజం కళాశాల్లో సహృదయ సాహితి ఆధ్వర్యంలో ప్రముఖ కథారచయిత మునిపల్లె రాజు కథా సాహిత్యంపై డాక్టర్ డి.వి. సూర్యారావు ప్రసంగం, చర్చాగోష్ఠి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విశ్లేషకులు, రచయిత డాక్టర్ సూర్యారావు మాట్లాడుతూ గొప్ప తెలుగు కథా రచయితల్లో కిందటి తరానికి ప్రతిభావంతుడైన ప్రతినిధి మునిపెల్ల రాజు అన్నారు. రక్షణ శాఖ ఉద్యోగిగా దేశమంతటా తిరిగిన ఆయన తాను చూసినవీ, విన్నవీ అనుభవాలు, అనుభూతులను అర్థమైన రీతిలో అక్షర చిత్రాలుగా మలిచారన్నారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.జి. వేణు, డాక్టర్ సూరపనేని విజయకుమార్, సీహెచ్ చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్‌లో తపాలా సేవలు పునఃప్రారంభం

మాధవధార, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్‌లో తపాలా కార్యాలయం బుధవారం తిరిగి ఆరంభమైంది. కొద్ది నెలల క్రితం కారణాలేవీ చూపకుండా చిరునామా మార్పుతో మూసివేశారు. పత్రికల్లో కథనాలు రావడం, స్థానిక నాయకుల తోడ్పాటు, మురళీనగర్ నివాసితుల సంఘం అభ్యర్థన మేరకు తపాలా కార్యాలయం మళ్లీ తెరుచుకుంది. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, ఎంపీ భరత్‌ల దృష్టికి ఈ సమస్య తీసుకుని వెళ్లడంతో తపాలాశాఖ సూపరింటెండెంట్ గజేంద్రకుమార్ మీనా దీన్ని తిరిగి ఆరంభించారు. నిత్యం ఈ ప్రాంతవాసులు డిపాజిట్లు, సంక్షేమ పథకాలు, వృద్ధులు పొదుపు పథకాల కోసం తపాలా కార్యాలయానికి చేరుతుంటారు. మురళీనగర్‌లో మళ్లీ కార్యాలయం తెరవడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

రూ.129 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

సీతమ్మధార, మార్చి 12, (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో సృజని పార్క్ వద్ద రూ.12.9 లక్షలతో చేపట్టనున్న డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులను ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామల దీపిక బుధవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ అనిల్‌కుమార్ రాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉందాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

సీతంపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటూ, ఆరోగ్యాన్ని కాపాడుకుందామని వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ప్రజలకు, వర్తకులకు పిలుపునిచ్చారు. కొటప్పా ఆధ్వర్యంలో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల చట్టం -2003 అమలు ఆవశ్యకత, ఇతర అంశాలపై అవగాన కల్పించే నిమిత్తం వైద్యారోగ్య శాఖ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేట్ కన్సల్టెంట్ శివశంకర్ పర్యవేక్షణలో సత్యం కూడలి వద్ద పలు పాన్‌షాప్‌లలో పొగాకు ఉత్పత్తులను పరిశీలించి దుకాణదారులకు జరిమానాలు విధించారు. దీంతో పాటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నక్కవానిపాలెం ప్రాథమిక పాఠశాలను సందర్శించి పొగాకు ఉత్పత్తుల వినియోగం ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హారిక, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేత్రవైద్యశాలకు వెల్లువలా వస్తున్న కంటి బాధితులు



రామాటాకీస్ రోడ్డు అంబేద్కర్ భవన్ ఎదురుగా గల ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రికి బుధవారం కంటి బాధితులు వెల్లువలా తరలివచ్చారు. ఉదయం 10 గంటల సమయానికే వచ్చి టోకెన్ల కోసం పోటీపడుతున్నారు. వైద్యసిబ్బంది వీరిని పరీక్షించి అనుమానితులకు గ్లకోమా స్క్రీనింగ్‌కు సిఫార్సు చేస్తున్నారు. కొందరికి కళ్లజోళ్ల మార్పిడికి సలహా ఇచ్చారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఒక రోజు విరామం ఇచ్చి రమ్మని పంపారు. రోజురోజుకు బాధితులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నందున తగినంత మంది వైద్య సిబ్బంది లేక ఇబ్బందిపడుతున్నారు. -ఆంధ్రజ్యోతి, సీతంపేట

టార్గెట్ ఒలింపిక్స్

... 5వ పేజీ తరువాయి

జ్యోతి పాల్గొంది. ఒలింపిక్స్‌లో పాల్గొన్న తొలి భారత మహిళ అథ్లెట్‌గా గుర్తింపుపొందింది. అనేక జాతీయ రికార్డులను సాధించింది. శనివారం ఇరాన్‌లో జరిగిన ఏషియన్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌లో 60 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. 60 మీటర్ల హర్డిల్స్ రేస్‌ను 8.12 సెకండ్లలో పూర్తిచేసి, గతంతో తాను నెలకొల్పిన జాతీయ రికార్డును తిరగరాసింది. గత నెల డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ క్రీడల అథ్లెటిక్స్‌లో 100, 200 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకాలు సాధించి రాష్ట్ర కీర్తిని చాటింది. జాతీయ స్థాయి అథ్లెటిక్స్ మీట్స్‌లో ఇప్పటివరకూ 39 పతకాలు సాధించిన జ్యోతి ఎర్రాజీ...అంతర్జాతీయ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో తనదైన ఎక్స్‌ప్రెస్ వేగంతో అనేక పతకాలు సొంతం చేసుకుంది.

ఇళ్ల స్థలాల హామీ నిలబెట్టుకోవాలని సీపీఐ ఆందోళన



ఇళ్ల స్థలాల కోసం పేదలతో కలిసి సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

సీతమ్మధార, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం పెద్ద సంఖ్యలో పేదలు విశాఖ సీతమ్మధారలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పేదల ద్వారా ఇళ్లకు దరఖాస్తులను అందచేశారు. ఎం.పైడిరాజు, పాత్రపిల్ల చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా హామీ అమలుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రహమాన్, అచ్యుతరావు, పడాల గోవింద్, నాగభూషణం, నల్లయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించనందునే హయగ్రీవ భూములు వెనక్కి

త్వరలో రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు: కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించనందునే 'హయగ్రీవ'కు కేటాయించిన భూములు వెనక్కి తీసుకున్నామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ స్పష్టంచేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న భూములను 22-ఎలో చేర్చామని పేర్కొన్నారు. ఆ భూములు గతంలో 22-ఎలో లేకపోవడంతో సమస్యలు వచ్చాయన్నారు. రుషికొండ బీచ్‌కు త్వరలో తిరిగి బ్లూ ఫ్లాగ్ హోదా లభిస్తుందని కలెక్టర్ అన్నారు. బీచ్‌లో సౌకర్యాల కల్పనపై దృష్టిసారించామన్నారు. బీచ్‌కు వెళ్లే సందర్శకులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రెండో వైపు రహదారి అందుబాటులోకి తెచ్చామన్నారు. బ్లూఫ్లాగ్ నిర్వహణ సంస్థతో ఎప్పటికప్పుడు సంప్రతింపులు చేస్తున్నామని తెలిపారు. కొద్దిరోజుల్లో రుషికొండ బీచ్‌లో పూర్తిస్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

ఏప్రిల్ 20న ఫిల్మ్ క్లబ్ ఎన్నికలు

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌కు ఎట్టకేలకు ఎన్నికలు నిర్వహించడానికి కార్యవర్గం ముందుకువచ్చింది. ఈ నెల 6వ తేదీన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించింది. ఏప్రిల్ 20న ఎన్నికలు నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన వారు పోటీ చేయవచ్చునని ప్రకటించింది. ఇప్పటివరకూ ఈ క్లబ్‌కు అధ్యక్షునిగా వైసీపీ నాయకులు కాయల వెంకటరెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎస్ఆర్ షాపింగ్ మాల్ గోపీనాథ్ రెడ్డి వ్యవహరించారు. మూడు నెలల క్రితం కోశాధికారి, అధ్యక్షులు ఒకరి తరువాత మరొకరు రాజీనామాలు సమర్పించారు. కానీ వాటిని ఆమోదించకుండా మిగిలిన కార్యవర్గం ఇన్ని రోజులు డ్రామా నడిపించుకుంటూ వచ్చింది. ఈ క్లబ్‌లో సభ్యత్వ రుసుము చెల్లించకుండా కొనసాగుతున్నవారే అన్నీ తామై నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. క్లబ్ సిబ్బందిపై ఆరోపణలు రావడంతో వారు కూడా ఉద్యోగాలకు రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఎమ్మెల్యేలతో పాటు దిగువ స్థాయి అధికారులకు కూడా ఉచిత సభ్యత్వం కల్పించడంపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఇకపై కూడా ఈ క్లబ్‌పై వైసీపీ పెత్తనమే కొనసాగేలా కొందరు పావులు కదుపుతున్నారని ప్రచారం జరుగుతోంది.

గ్రీన్‌బెల్ట్ పార్కులో కానరాని సొబగులు



పార్కులో విరిగిపోయిన బెంచి

అక్కయ్యపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ పార్కులో బెంచ్, లైట్లు విరిగిపోయాయి. ఈ పార్కులో చాలా మంది వాకర్లు వచ్చి నడుస్తుంటారు. పార్కులో కూర్చొని సేద తీర్చుకుందామనుకుంటే బెంచ్ విరిగిపోవడంతో కూర్చోవడానికి వీలు కుదరడం లేదని అంటున్నారు. విద్యుద్దీపాలంకరణతో ధగధగ మెరిసే పార్కు లైట్లు విరిగిపోవడంతో అంధకారంలో ఉందని చెబుతున్నారు. ఈ పార్కును పరిరక్షించి నిర్వహణ చేపట్టాల్సిన జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని వాకర్లు పేర్కొంటున్నారు. అలాగే పార్కు ప్రారంభంలో విద్యుత్ దీపాలు, బెంచ్‌లు, నంది విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆర్భాటంగా ప్రారంభించింది. కానీ వాటిని నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అలాగే కొన్ని మొక్కలు ఎండిపోవడంతో అబిద్‌నగర్ ప్రాంతానికి చెందిన సంఘ సేవకుడు వీవీ రాజు తన సొంత నిధులతో మొక్కలు తెప్పించి వేశారు. అలాగే పార్కుకు అవసరమైన పరికరాలకు మరమ్మతులు చేయిస్తున్నారు. పార్కును కూడా స్వచ్ఛందంగా శుభ్రం చేస్తున్నారు. బెంచ్, లైట్లు విరిగి రోజులు గడిచినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని వాకర్లు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఎండిపోయిన మొక్కలను పునరుద్ధరించి, విరిగిపోయిన బెంచ్, లైట్లను వేయించాలని కోరుతున్నారు.

స్వయం ఉపాధికి ఊతం

... 5వ పేజీ తరువాయి

అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిరప్రసాద్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు (కాపు, తెలగ, బలిజ, ఒంటరి) కులాలకు చెందిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రుణాలకుఈ నెల 22వ తేదీలోగా [illegible] వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యవసాయం, అనుబంధ, రవాణా, పరిశ్రమలు, సేవలు, వ్యాపార రంగాల్లో స్వయం ఉపాధి పొందేందుకు సబ్సిడీపై రుణాలు అందిస్తామన్నారు. బీ.ఫార్మసీ/డీ.ఫార్మసీ పూర్తి చేసిన నిరుద్యోగ బీసీ, ఈబీసీ యువతకు జనరిక్ ఔషధ దుకాణాల ఏర్పాటుకు రుణాలు అందించనున్నట్లు వెల్లడించారు. మేదర, కుమ్మరి/సాలివాహన వృత్తి చేస్తున్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. కాగా, ఇందులో 50 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోందని, మరో 50 శాతం బ్యాంకు రుణంగా మంజూరుచేస్తుందని అధికారులు చెబుతున్నారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని కార్పొరేషన్లకు ప్రభుత్వం 2,313 యూనిట్లను మంజూరుచేసింది. ఇందులో సబ్సిడీ రూ.27.21 కోట్లు, బ్యాంకు రుణం రూ.27.21 కలిపి మొత్తం రూ.54.44 కోట్లు., బీసీ సంక్షేమ శాఖ పరిధిలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కొద్ది రోజుల కిందట దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేశారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఆర్య వైశ్య, రెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ల పరిధిలోని మహిళలకు ఉచితంగా మూడు కేటగిరీల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నారు. ఆయా కార్పొరేషన్ల పరిధిలో 3,596 మంది లబ్ధిదారులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు ఖరీదైన కుట్టు మిషన్లను అందించనున్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ పరిధిలోని లబ్ధిదారులకు ఇదే తరహాలో సబ్సిడీతో కూడిన రుణాలు అందించేందుకు మరో వారం రోజుల్లో ఉత్తర్వులు వెలువడతాయని అధికారులు చెబుతున్నారు.

మరిన్ని పథకాలు..

గతంలో మాదిరిగా సంక్షేమ శాఖలను పూర్తిగా గాడిన పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వందలాది మంది నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రతి నెలా స్టైపెండ్ అందిస్తోంది. అలాగే యువత స్వయం ఉపాధి పొందేలా గతంలో మాదిరిగా వివిధ రకాల వాహనాలు అందించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు చెబుతున్నారు. కొద్దిరోజుల్లోనే వీటికి సంబంధించిన విధి, విధానాలు వెలువడతాయని అధికారులు చెబుతున్నారు. ఇంకా కోళ్ల పెంపకం, దుకాణాల ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించనున్నట్టు అధికారులు వెల్లడించారు.

పేదల గృహ నిర్మాణానికి రూ.305.13 కోట్లు

... 5వ పేజీ తరువాయి

రూ.1.8 లక్షలు అని, దీనిలో భాగంగా ఆప్షన్-1 (లబ్ధిదారుడు సొంతంగా ఇళ్లు నిర్మించడం); ఆప్షన్ 2 (ప్రభుత్వం మెటీరియల్ ఇస్తే లబ్ధిదారుడు నిర్మించుకోవడం) కింద జిల్లాకు మంజూరైన 24 వేల ఇళ్లలో ఇంతవరకూ పూర్తిచేయని బీసీ/ఎస్సీ/ఎస్టీ వర్గాలకు చెందిన ఇళ్లు 8,619 ఉన్నాయన్నారు. వారందరికీ రూ.43.4 కోట్లు అదనపు సాయం అందుతుందన్నారు. అలాగే నగర శివారుల్లోని 65 లేఅవుట్‌లలో ప్రారంభించిన 1,14,805 ఇళ్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందినవి 63,963 ఇళ్లు ఉన్నాయన్నారు. వారికి రూ.321.73 కోట్లు సాయం అందుతుందన్నారు. ఇళ్లు పూర్తిచేయడానికిగాను లబ్ధిదారుల ఖాతాలకు సొమ్ములు జమ చేస్తామన్నారు. ప్రభుత్వం అందించే సాయంతో ఇళ్లు పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

మధురవాడలో 2 ఐకానిక్ ప్రాజెక్టులు

... 5వ పేజీ తరువాయి

ప్రణాళిక రూపొందించారు. ఇది కూడా లా కాలేజీ మార్గంలో ఐకానికా గ్రాండ్ సమీపాన 2.82 ఎకరాల్లో వస్తుంది. గేమింగ్‌కు మొగ్గు చూపే యువతను ఆకర్షించేలా వర్చువల్ రియాల్టీ, ఆగ్‌మెంటెడ్ రియాల్టీ, ఇంటరాక్టివ్ గేమింగ్ వంటి సాంకేతిక అంశాలతో దీనిని తీర్చిదిద్దుతారు. ఇవి వై, జెడ్, ఆల్ఫా తరాలకు చెందిన యువతను లక్ష్యంగా చేసుకొని నిర్మించనున్నారు. 360 డిగ్రీల ఇమ్మెన్సివ్ థియేటర్, మిక్స్‌డ్ రియాల్టీ ఎస్కేప్ రూమ్, యానిమేషన్ షో, వీఆర్ గేమింగ్ జోన్, అక్వేరియం వంటి ఉంటాయి. డ్రైవ్-ఇన్ ఫుడ్ జోన్, 24/7 కేఫ్‌లు, 3 స్టార్ హోటల్ నిర్మిస్తారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఉండే ఐటీ కంపెనీలు, అందులో పనిచేసే ఉద్యోగుల కుటుంబాల అవసరాల కోసం దీనిని డిజైన్ చేశారు.

కొత్త తరాలంటే...

'వై' జనరేషన్ అంటే...1981-1996 మధ్య పుట్టినవారు. 28 ఏళ్ల నుంచి 42 మధ్య వయసు కలిగినవారు. వీరిని మిలేనియల్స్ అని కూడా వ్యవహరిస్తున్నారు. వీరు టెక్నాలజీపై ఆసక్తితో పాటు వివిధ అంశాలపై అవగాహన కలిగి ఉంటారు. 'జెడ్' జనరేషన్ అంటే...1997-2012 మధ్య జన్మించినవారు. వీరి వయస్సు 11 నుంచి 26 ఏళ్ల మధ్య ఉంటుంది. ఇండిపెండెంట్‌గా, హైపర్-డిజిటల్‌గా ఉంటారు. స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియా, ఈ-కామర్స్‌తో అనుబంధం కలిగిన వారు.

'ఆల్ఫా' జనరేషన్ అంటే...2013-2025 మధ్య జన్మించినవారు. పదేళ్లలోపు వయస్సువారు.

త్రీటౌన్ సీఐగా పైడయ్య బాధ్యతల స్వీకారం



మద్దిలపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మూడో పట్టణ పోలీస్ స్టేషన్ శాంతి భద్రతల సీఐగా పి.పైడయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, బాధితులకు సత్వరన్యాయం చేకూర్చేవిధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. తమ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. పబ్లిక్ న్యూసెన్స్ ప్రాంతాలు గుర్తించి గస్తీ పెంచి ఆకతాయిల అల్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ పరిధిలో 19 మంది రౌడీషీటర్స్ ఉన్నారని వారి కార్యకలాపాలపై నిత్యం నిఘా పెడతామని తెలిపారు. శని, ఆదివారాల్లో హోటల్ పార్క్ నుంచి ఆర్కే బీచ్ వరకు రద్దీగా ఉంటుందని, ఆయా రోజుల్లో సందర్శకుల రక్షణ, సముద్ర ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



వైసీపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు

మద్దిలపాలెం, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేస్తామని ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యకర్తలందరూ కొద్ది రోజులు కష్టపడి పనిచేస్తే మళ్లీ మంచి రోజులు వస్తాయన్నారు.. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయకుమార్, మళ్ల విజయప్రసాద్, చింతలపూడి వెంకట్రామయ్య, వైసీపీ నాయకులు రవిరెడ్డి, శివరామకృష్ణ, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం:** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ(గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 16, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 42, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 38, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)50, బరబాటి 36, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 58, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 22, మామిడిఅల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176



ఎంవీపీ కాలనీ క్యాన్సర్ ఆస్పత్రి వద్ద అనధికార పార్కింగ్



రైతు బజారు ఎదురుగా రోడ్డు పక్కన ద్విచక్రవాహనాలు

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

- ఎంవీపీ కాలనీలో నిత్యం ట్రాఫిక్ సమస్య
- పెద్ద సంస్థలకూ సెల్లార్లు కరువు

ఎంవీపీ కాలనీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ.. పేరు గొప్ప, ఊరు దిబ్బ నానుడికి ప్రతీకగా మారుతోంది. నగరంలోనే పక్కా ప్రణాళిక గల కాలనీగా చెప్పుకునే ముప్వలవానిపాలెం పన్నెండు సెక్టార్లలో విస్తరించి ఉంది. వసతులకు కరవు లేదు. చక్కని రోడ్లు, ఇరువైపులా చెట్లు, వృక్షాలతో అలరారుతుంది. విద్యా సంస్థలు, అనేక రకాల వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు.. అన్ని విధాలుగా అభివృద్ధిన ప్రాంతంగా చెప్పుకోవచ్చు. విద్యావంతులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులకు నిలయమైన ఈ కాలనీలో భూముల ధరలు కూడా ఎక్కువే. ఎంవీపీ కాలనీలోని ఏ కూడలి చూసినా బడ్డీల మయమే. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తుంటారు. పాదచారులకు ఇదే సమస్య అనుకుంటే మరో సమస్య కూడా వెంటాడుతోంది. అదే వాహనాల పార్కింగ్.

కాలనీలో పెద్ద పెద్ద సంస్థలున్నా, వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవడం, సెల్లార్లు లేకపోవడం తదితర కారణాల వల్ల ఆయా సంస్థలకు వచ్చేవారు రోడ్డుపైనే తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఈ అనధికార పార్కింగ్ ఇబ్బందిగా మారింది. ప్రధాన రహదారుల్లో ప్రయాణం చేసేటప్పుడు ఎక్కడైనా చిన్న కారణంతో ఆగాల్సి వస్తే రోడ్డుపక్కకి వాహనాన్ని నిలిపి ఉంచితే ఇతర వాహనాలకు దారి ఉంటుంది. ఇది కూడా కొద్ది సేపు ట్రాఫిక్‌కు ఇబ్బంది ఉంటుంది. కానీ ఈ కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో ఆయా సంస్థలకు వచ్చే వారి ద్విచక్ర వాహనాలు, కార్లు రోడ్డు పక్కనే నిలిపివేస్తున్నారు. ఉదాహరణకు ఎంవీపీ డబుల్ రోడ్డులోని రైతు బజారు వద్ద నిత్యం రద్దీ ఉంటుంది. దీనికి ఎదురుగా గాయత్రీ కళాశాల, సీబీఐ, తపాలా శాఖ వంటివి ఉన్నాయి. ముఖ్యంగా గాయత్రీ కళాశాలకు వచ్చే వందలాది మంది విద్యార్థులు వారి ద్విచక్ర వాహనాలను రోడ్డుపైనే పార్కు చేస్తున్నారు. దీంతో ఇక్కడ కీలక సమయాల్లో ట్రాఫిక్ స్తంభించిపోతోంది.

ఎంవీపీ ప్రధాన రోడ్డులోని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వద్ద కూడా ఇదే పరిస్థితి. కార్లు, ఆటోలు, ఇతర వాహనాలు ఆస్పత్రి బయట రోడ్డుపైనే నిలపాల్సి ఉంటోంది. ఇక్కడ ఉన్నది కూడా సింగిల్ రోడ్డు, మలుపు కూడా. మరో పక్క వంతెన ఉంది.

దీంతో నిత్యం ఇక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఏడాదికొకసారి మొక్కుబడిగా చర్యలు తీసుకుంటున్నారు. నో పార్కింగ్ బోర్డు పాతేసి మిన్నకుంటున్నారు. మరో పక్క ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసేవారితో పాదచారులకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫుట్‌పాత్‌లు ఖాళీ లేక, రోడ్డు పక్కన అనధికారి పార్కింగ్‌లతో ఈ ప్రాంతీయులకు నిత్యం సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సైబర్ సెక్యూరిటీ రంగంలో నిపుణులుగా మారాలి

- యువతకు సీపీ శంఖబ్రత బాగ్చి పిలుపు



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

వెంకోజీపాలెం/ మద్దిలపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : యువతరం సైబర్ నేరాలను నియంత్రించే నిపుణులుగా తయారు కావాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. బుధవారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం, నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంయుక్తంగా నిర్వహించిన ఐదు రోజుల బూట్ క్యాంపు ముగింపు వేడుకలను బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహిస్తున్న ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ (ఐఎస్ఈఏ) ప్రాజెక్ట్-3లో భాగంగా ఐదు రోజుల బూట్ క్యాంపును సైబర్ సెక్యూరిటీ, ప్రైవసీ, క్రిప్టోగ్రఫీ వెబ్ అప్లికేషన్ పెనట్రేషన్ టెస్టింగ్ అంశంపై నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో పోలీసు కమిషనర్ మాట్లాడుతూ ప్రశ్నించడం మొదలు పెడితేనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. సెబర్ దాడులు, సైబర్ నేరాలు అనేక దేశాలను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న విధానాన్ని వివరించారు. వ్యవస్థలో లోపాలను తమకు అనుకూలంగా మార్చుకుని సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్న విధానాన్ని వివరించారు. యువత సైబర్ సెక్యూరిటీ రంగంలో నిష్ణాతులుగా మారడానికి అవసరమైన కోర్సులను చేయాలని, తమ సామర్థ్యాలను నిరంతరం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. వివిధ రూపాల్లో జరుగుతున్న సైబర్ నేరాలు, వాటికి గల కారణాలు నివారించడానికి అనుసరించాల్సిన పద్ధతులను విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా మహిళలను, విద్యార్థినులను నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారని, వీరు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ తరగతి గదిలో నేర్చుకున్న దానికి భిన్నంగా బూట్ క్యాంపులో నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని చెప్పారు. పోలీస్ శాఖ నేడు అనేక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటోందన్నారు. సదస్సు సమన్వయకర్త ఆచార్య వి.వల్లికుమారి మాట్లాడుతూ ఐదు రోజుల బూట్ క్యాంప్‌లో 56 మంది పాల్గొన్నారని, వీరికి నాలుగు అంశాలపై సమస్యలను ఇచ్చి పరిష్కరించే విధంగా వారిని సన్నద్ధం చేశామని చెప్పారు. అత్యున్నత నైపుణ్యాలు కలిగిన సైబర్ సెక్యూరిటీ నిపుణులుగా తయారు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

నేడు అవయదానంపై అవగాహన కార్యక్రమం

అరిలోవ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ కిడ్నీ డేని పురష్కరించుకొని జీవన్‌ధాన్ ఆధ్వర్యంలో అవయువదానంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఆర్కే బీచ్‌లో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర జీవన్‌ధాన్ కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.. గురువారం ఉదయం ఆరు గంటలకు ఆర్కే బీచ్‌లో గల కాళీమాత దేవాలయం వద్ద చేపట్టనున్న ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరీంధర్ ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి హాజరు కానున్నట్టు తెలిపారు. అలాగే ఆంధ్రామెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, కేజీహెచ్ సూపరిటెండెంట్ డాక్టర్ శివదానంద తదితరులు పాలొని అవయువ దానంపై అవగాహన కలిగిస్తారని రాంబాబు తెలిపారు.

అన్న సమారాధన



అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి వెలగపూడి సుజన

అరిలోవ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): హనుమంతవాక జంక్షన్ సమీపంలోగల రామాలయం వీధిలో వెలసిన అభవయవరసిద్ధి వినాయక ఆలయం వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణబాబు సతీమణి సుజన, వడ్లమూడి కళ్యాణి, సుధ, మంగ, ప్రభ, రాంబాబు, శ్రీనివాసరెడ్డిపాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం

- వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగప్రసాద్, ఐలా మాజీ చైర్మన్ యార్లగడ్డ సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగప్రసాద్

ఆటోనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ కార్మికులు, షెడ్ల నిర్వాహకులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన జీవోలు-5,6లను నిలిపివేయడం హర్షణీయమని వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగప్రసాద్, ఐలా మాజీ చైర్మన్ యార్లగడ్డ సాంబశివరావులు పేర్కొన్నారు. ఆటోనగర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జీవో నంబర్-41ను తెచ్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం జీవో నంబర్-5, 6లను తెచ్చి ఆటోనగర్‌లో ప్లాట్లను మార్కెట్ విలువలో 50 శాతం ఇంపాక్ట్ ఫీజు, ఇతర చార్జీలను చెల్లించి కమర్షియల్‌గా మార్చుకోమంటూ పారిశ్రామికవేత్తలపై ఒత్తిడి తెచ్చిందన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా మెలగాలి

- ఏయూ ఉపకులపతి రాజశేఖర్



డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

వెంకోజీపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏయూ జాతీయ సేవా పథకం వలంటీర్లు దీనిలో ముఖ్యభూమిక పోషించాలని కోరారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సామాజిక స్పృహతో నడుచుకుంటూ ప్రజల్లో మత్తు పదార్థాల దుష్పరిణామాలను విస్తృతంగా వివరించాలని, వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఆరోగ్యకర జీవితాన్ని యువతరం అలవాటు చేసుకోవాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే యువత భవిష్యత్తు, ఆరోగ్యం నాశనం అవుతాయని తెలుసుకోవాలని కోరారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ద్వారా విస్తృత ప్రచారం కల్పించి యువతలో మంచి మార్పును తీసుకురావడానికి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి నిరంతరం కృషి చేయాలని వీసీ సూచించారు.

కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పి.శైలజ కె.పల్లవి, సీహెచ్ శ్రీనివాసరావు, బి.సుబ్బయ్య, శ్రీదేవి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్రి ప్రొడక్ట్స్ ఎగుమతులపై విద్యార్థులకు అవగాహన సదస్సు

వెంకోజీపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో అగ్రి ప్రొడక్ట్ ఎగుమతులపై అతిథి ఉపన్యాసాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి అధ్యక్షత వహించి భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రత్యేక స్థానం ఉన్నదని, మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లో పండిస్తున్న పంటలను విదేశాలకు ఎగుమతులు చేసి మార్కెట్ డిమాండ్‌ను తీసుకురావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ మారిపల్లి శివ హాజరై ఆంధ్రప్రదేశ్‌లో పండుతున్న వివిధ వ్యవసాయ ఉత్పత్తుల గురించి ప్రముఖంగా బియ్యం, అరటి, మామిడి, మీట్‌పై విశ్లేషణ చేసి వీటిలో విదేశాలకు ఎగుమతి చేయగలిగిన ఉత్పత్తి, డిమాండ్ ఉన్న వాటిని గుర్తించి ఉత్పత్తులను ఏ రకంగా విదేశాలకు ఎగుమతి చేయవచ్చు, వాటికి అవసరమైన డాక్యుమెంటేషన్ గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మేనేజ్‌మెంట్, కామర్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు చాలా ఉత్సాహంతో ఎగుమతుల ప్రక్రియపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం ప్రొఫెసర్ జాలాది రవి, డిపార్ట్‌మెంట్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య ముఖ్యఅతిథిగా హాజరైన రిసోర్స్ పర్సన్ మారిపల్లి శివను ఘనంగా సత్కరించారు.

అంధ ఉపాధ్యాయులకు స్మార్ట్‌విజన్ గ్లాస్‌లు వితరణ



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహక ప్రతినిధులు

మధురవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ ఆధ్వర్యంలో చెరుకుపల్లి కుటుంబసభ్యులు, విజన్ ఎయిడ్ ఇండియా వారి సహకారంతో మధురవాడ మోడల్ స్కూల్ ఫర్ బ్లైండ్ పాఠశాల ఉపాధ్యాయులకు బుధవారం ఉచితంగా స్మార్ట్‌గ్లాసులు పంపిణీ చేశారు. సీబీఈ టెక్ సర్వీసెస్ రమణిశివరావ్ జ్ఞాపకార్థం నలుగురు ఉపాధ్యాయులకు వీటిని అందించారు. ఒక్కో జత స్మార్ట్‌గ్లాస్ ధర సుమారు రూ.1.25 లక్షలు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.కృత్రిమమేథ టెక్నాలజీతో ఉన్న స్మార్ట్‌గ్లాస్‌ల వల్ల పరిసరాలను సులభంగా గుర్తించవచ్చన్నారు. ఈ అద్దాల్లో అమర్చిన చిప్‌లో ఉన్న రీడింగ్ మోడ్ ద్వారా అంధులు ఏ భాషలో ఉన్న పుస్తకమైనా అది చదివి వినిపిస్తుందన్నారు.. దీంతో పాటు అంధులకు కదలికలో కూడా ఈ స్మార్ట్‌గ్లాసులు పూర్తిగా ఉపయోగపడతాయి. మొదటి విడతగా రామదుర్గ అనే ఉపాధ్యాయినితో పాటు మరో నలుగురికి ఈ అద్దాలు ఉచితంగా ఇచ్చామని, మలిదశలో కొంతమంది విద్యార్థులకు కూడా వీటిని పంపిణీ చేయనున్నట్టు శివరావ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అవసరాల శ్రీనివాస్, పి.రఘు, కంటిపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ బాల్ బ్యాడ్మింటన్ పురుషుల జట్టు ఎంపిక



బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైన ఏయూ విద్యార్థులు

వెంకోజీపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఏయూ బాల్ బ్యాడ్మింటన్ పురుషుల జట్టు ఎంపిక చేసినట్టు ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎన్.విజయమోహన్ తెలిపారు . ఈ పోటీలు మార్చి 14 నుంచి 18 వరకు బెంగళూరు సెంట్రల్ యూనివర్సిటీలో జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రొఫెసర్ ఎన్.విజయ మోహన్, ఏయూ వ్యాయామ విద్యావిభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి అభినందించారు.

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టండి

3వ పట్టణ పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు



సీఐ పైడయ్యకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు నక్కా కనకరాజు తదితరులు

రామ్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని 28వ వార్డులో రామ్‌నగర్, జీవీఎంసీ ప్రధాన కార్యాలయం పరిసరాలు, జైసంతోషిమాత కాలనీ ప్రాంతాల్లో సాయంత్రమైతే అసాంఘిక కార్యకలాపాలపై అడ్డాలుగా మారుతున్నాయని, వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ నక్కా కనకరాజు ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నేతలు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.నక్కా కనకరాజుతో పాటు టీఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు ఆర్సీ అప్పల నారాయణ బుధవారం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.పైడయ్యను కలసి వినతిపత్రాన్ని అందించారు. రామ్‌నగర్ ఏరియాలో బజార్ సెంటరు, జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమీప ప్రాంతాలు, జైసంతోషిమాత కాలనీ, తదితర ప్రాంతాల్లో యువకులు మాదకద్రవ్యాలు వినియోగిస్తూ అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా కార్పొరేషన్ ప్రాంతంలో కొందరు ఆకతాయలు అసభ్యకరంగా ప్రవరిస్తూ అటుగా రాకపోకలు సాగించే వారికి ఇబ్బంది కలిగిస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎక్కడిఎక్కడి నుంచో యువకులు వస్తూ అసాంఘిక కార్యకాపాలకు పాల్పడుతున్నారన్నారు. ఇక్కడ యువకులు మద్యం, గంజాయి వంటివి సేవించి రోడ్డుపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అటువంటి వారిని కట్టడి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ పైడయ్యకు టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు.

వ్యవసాయ యంత్రపరికరాలు రాయితీపై పంపిణీకి సిద్ధం

- వ్యవసాయాధికారి సంధ్యరత్నప్రభ

ఆనందపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు శనివారం వ్యవసాయాధికారి సిహెచ్ సంధ్య రత్నప్రభ తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్లు, చేతి పంపులు (మందు క్యాన్లు), పవర్ స్ప్రేయర్లు (పెట్రోల్ పంపులు) మరియు ట్రాక్టర్‌కు జతపరిచే పనిముట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పరికరాలు రాయితీపై పొందాలనుకునే రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ పథకం ద్వారా ఒక రైతుకు ఒక పరికరం మాత్రమే ఇవ్వనున్నారని అందువలన రైతులు తమకు అవసరమైన పరికరాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. ప్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జెరాక్స్‌లతో పాటు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు అందజేయడంతో పాటు ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నెంబర్‌ను ఇవ్వాలన్నారు. గత మూడు సంవత్సరాలుగా ఈ-పంటలో నమోదు కావడంతో పాటు భూసార పరీక్ష కార్డు ఒక ఏడాదిది అయినా నకలు సమర్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారైతే సంబంధిత కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఏయూ సదస్సుకు దివిస్ లేబొరేటరీస్ ఆర్థిక సహాయం



చెక్‌ను అందజేస్తున్న దివీస్ లేబరేటరీ ప్రతినిధులు


వెంకోజీపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ వర్క్ షాప్ ఆన్ సస్టైనబుల్ ప్రాక్టీసెస్ ఫర్ ఇండస్ట్రియల్ పొల్యూషన్ కంట్రోల్ సదస్సు నిర్వహణకు దివీస్ లేబరేటరీ సంస్థ తమ సీఎస్ఆర్‌లో భాగంగా రూ.65 వేలు నిధులను అందించింది. సంస్థ సీఎస్ఆర్ విభాగం మేనేజర్ డి.సురేష్‌కుమార్ సంస్థ తరఫున చెక్కును సదస్సు నిర్వాహకులకు ఏయూలో అందజేశారు. పారిశ్రామిక కాలుష్య నివారణకు అవసరమైన విధానాలను రూపొందించడం, అమలు చేయడంపై ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. విభిన్న రంగాలకు చెందిన నిపుణులు విశిష్ట ప్రసంగాలు, ప్రత్యక్ష శిక్షణ అందించారు. పరిశ్రమలకు, సమాజానికి విపరీతంగా నిలిచే అంశంపై సదస్సు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ దివీస్ లాబరేటరీ యాజమాన్యం నిదులను సదస్సు నిర్వహణకు వినియోగించాలని కోరుతూ అందజేశారు. వర్క్‌షాప్‌లో భాగంగా పరిశ్రమల కాలుష్యం, పరిశోధకులు-విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణ, గ్రీన్ టెక్నాలజీపై అవగాహన, సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా ప్రయత్నాలను సదస్సులో చర్చించారు. ఈ కార్యక్రమంలో కెమికల్ ఇంజనీరింగ్ విభాగాచార్యులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు రోడ్డులో లారీ డ్రైవర్లను బెదిరించి దోపిడీ

గాజువాక, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): లారీలో నిద్రిస్తున్న డ్రైవర్లను కత్తితో బెదిరించి దోపిడీకి పాల్పడిన సంఘటన బుధవారం వేకువజామున గంగవరం పోర్టు రోడ్డులో చోటుచేసుకుంది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన అభిశంత్, జార్ఖండ్‌కు చెందిన ఇంతిజ్ అన్సారీలు గంగవరం పోర్టు రోడ్డులో మంగళవారం రాత్రి తమ లారీలను నిలిపివేసి ఎవరి వాహనంలో వారు నిద్రించారు. అయితే వేకువజాము నాలుగు గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి కత్తితో వారిని బెదిరించి, వారి వద్దనున్న రూ.3,500 నగదు, రెండు సెల్ ఫోన్లను లాక్కుని పారిపోయారు. దీంతో ఆ ఇద్దరు డ్రైవర్లు గాజువాక క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ సంఘటనకు సంబంధించి అప్పికొండ, మదీనాబాగ్ ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

రాష్ట్రంలో లోకేశ్ రాజ్యాంగం

» వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త కురసాల కన్నబాబు విమర్శ



విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోకేశ్ రాజ్యాంగం నడుస్తోందని వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి కురసాల కన్నబాబు విమర్శించారు. 'యువతపోరు' పేరుతో కలెక్టరేట్ వద్ద బుధవారం చేపట్టిన నిరసనలో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడం, నిరుద్యోగభృతి ఇవ్వక పోవడం, వైద్యకళాశాలలను ప్రైవేటుకు అప్పగించడాన్ని నిరసిస్తూ నిరసన తెలిపితే పోలీసులతో అడ్డుకున్నారని ఆరోపించారు. తమ పార్టీ పోరాటాలతో సీఎం చంద్రబాబు ఎందుకు వణికిపోతున్నారని ప్రశ్నించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. అంతకుముందు జిల్లా పరిషత్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ పోలీసులు వారిని అడ్డుకునేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. పది మంది నేతలు మాత్రమే కలెక్టరేట్ వరకు వెళ్లి వినతిపత్రం అందజేయాలని సూచించారు. దీనికి నేతలు ససేమిరా అంటూ దౌర్జన్యంగా బారికేడ్లను తోసుకుని దూసుకువెళ్లారు. ఈ సమయంలో కొందరు కిందపడిపోవడంతో తొక్కిసలాట జరుగుతుందేమోననే భయంతో పోలీసులు వారిని పక్కకు తొలగించారు. ఈ సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. అనంతరం కలెక్టరేట్ ప్రధానగేటు వద్ద పోలీసులు వారిని నిలువరించారు. ముఖ్య నేతలను మాత్రమే అనుమతించారు. దీంతో కురసాల కన్నబాబు, గుడివాడ అమర్‌నాథ్, వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయ్‌ప్రసాద్, జియ్యాని శ్రీధర్, మేయర్ హరివెంకటకుమారి కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేకేరాజు, తిప్పల దేవన్‌రెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రాజీవ్‌గాంధీ, చింతలపూడి వెంకటరామయ్య, తైనాల విజయ్‌కుమార్, రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 24, 25 తేదీల్లో సమ్మె

» ఇండియన్ బ్యాంకు ఉద్యోగుల నిరసన



బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న అధికారులు

సీతంపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు ఇండియన్ బ్యాంక్ జోనల్ ఆఫీస్‌లో అధికారులు, గుమస్తాలు, ఉద్యోగులు కలిసి బుధవారం డిమాండ్లు ప్రస్తావిస్తూ నినాదాలు చేశారు. ఈ నెల 24, 25 తేదీల్లో సమ్మెకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమైన డిమాండ్ల పరిష్కారం, అయిదు రోజుల పనిదినాలు, బ్యాంకులలో తగిన ఉద్యోగ నియామకాలు కల్పించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, అధికారులు యూనియన్ కార్యదర్శి శివప్రసాద్, బి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలేశుడి డోలోత్సవం రేపు

సింహాచలం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామివారి డోలోత్సవం ఈనెల 14న నిర్వహించేందుకు అధికారులు ర్పాట్లు పూర్తిచేశారు. ఉత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం 6.30 గంటలకు పల్లకిలో కొండదిగువకు మెట్లమార్గంలో స్వామి చేరుకుని పైడితల్లమ్మ ఆలయానికి వెళ్తారు. అక్కడ సోదరి తన కుమార్తెతో కల్యాణానికి సమ్మతించగా, ప్రధాన కూడలిలోని ఉద్యాన మండపానికి చేరుకుని డోలోత్సవాన్ని జరుపుకుంటారు. ఉత్సవంలో భాగంగా చూర్ణోత్సవం, వసంత్సోవాలను జరిపిస్తారు. అనం తరం మధ్యాహ్నం కొండదిగువ ప్రధాన మూడుమాడవీధుల్లో తిరువీధి ఉత్స వాన్ని జరిపి తిరిగి మెట్టమార్గంలో సింహగిరికి స్వామి వెళతారు. ఈ ఉత్సవం కోసం ఉద్యానవన మండపాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆర్జిత సేవలన్నింటినీ రద్దు చేస్తున్నట్టు దేవస్థానం ఈవో కె.సుబ్బారావు ప్రకటించారు.

మెరుగైన ఎన్నికల ప్రక్రియకు సూచనలివ్వండి

» రాజకీయ పార్టీలకు లేఖ పంపిన ఎన్నికల సంఘం

» కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ వెల్లడి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ, అధికారులు

మహారాణిపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఈఆర్‌వో, డీఈవో, సీఈవో స్థాయిలో పరిష్కారం కాని సమస్యలపై భారత ఎన్నికల సంఘానికి నేరుగా సూచనలు ఇవ్వవచ్చని భారత ఎన్నికల సంఘం జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలను కోరినట్లు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 30 నాటికి అన్ని పార్టీలు సూచనలు ఇవ్వవచ్చని గడువు నిర్ధారించింది. చట్టానికి అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు పరస్పరం అనుకూలమైన సమయంలో పార్టీ అధ్యక్షులు, సీనియర్ సభ్యులతో చర్చించాలని భావిస్తోందని తెలిపారు. వివిధస్థాయిలలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మార్చి 31 నాటికి తీసుకున్న చర్యలపై ఎన్నికల సంఘానికి నివేదిక పంపాలని అధికారులను ఆదేశించినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన రాజకీయ పార్టీలను కోరారు.

సీఎస్ వీసీపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

మహారాణిపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు, త్వరలో నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్సు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం, పీ4 మోడల్ సర్వేపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అనంతరం అధికారులతో సమావేశమై సీఎస్ ఆదేశాలను వివరించారు. జేసీ కె.మయూర్ అశోక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర విజయవంతం చేయాలి

మహారాణిపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహించాలని, సత్ఫలితాలు వచ్చేలా కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రతి మూడో శనివారం చేపడుతున్న స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. అజెండా అంశాలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో సేవా కార్యక్రమాలు చేపట్టడం, మెగా క్లీనింగ్ డ్రైవ్‌తో పరిసరాలను శుభ్రపరచడం, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండడం వంటివి అందరూ అంకితభావంతో చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ , ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు దేవాలయాలు, చర్చిలు, మసీదులు, పార్కులు, బస్సు, రైల్వే స్టేషన్లు, వసతి గృహాలు, ఆసుపత్రులు తదితర ప్రాంతాల్లో మూడో శనివారం స్వచ్ఛందంగా పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఆస్పత్రులు, విద్యా సంస్థలు, అంగన్‌వాడీ, పారిశ్రామిక కేంద్రాల్లో చేపట్టే కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

కన్నుల పండువగా అనంత పద్మనాభుని తెప్పోత్సవం

» వేలాదిగా తరలివచ్చిన భక్త జనం

» కన్నయ్య కోనేరులో విహరించిన స్వామివారు



పద్మనాభుని ఉత్సవ విగ్రహాలను కోనేరు వద్దకు తరలిస్తున్న దృశ్యం

పద్మనాభం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభుని కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పద్మనాభంలో స్వామి వారి తెప్పోత్సవం కన్నుల పండువగా జరిగింది. దేవస్థానం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు తెప్పోత్సవంలో పాల్గొన్నారు. గ్రామ బలిహరణ, విశేషహోమాలు అనంతరం కుంతీమాధవస్వామి ఆలయం నుంచి ఉభయ దేవేరులతో, అనంతపద్మనాభుని ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఊరేగింపుగా పద్మనాభం కూడలిలోని కన్నయ్య కోనేరు వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ స్వామివారిని నిలిపి ఉంచి ఆలయ ప్రధాన అర్చకుడు పి.సీతారామాంజనేయస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు విశ్వక్సేనపూజ, విశేష ఆరాధనలు చేశారు. అనంతరం స్వామిని తెప్పలోని శేషవాహనంపై అధిష్ఠింపజేసి భక్తుల జయ, జయధ్వానాల మధ్య శ్రీదేవి, భూదేవి సమేతుడైన అనంతపద్మనాభుడు కోనేరులో విహరించారు. ఈ సుందర దృశ్యాన్ని తిలకించి భక్తులు పునీతులయ్యారు. ఈ సందర్భంగా కోలాటం, పులివేషాలు ఏర్పాటు చేశారు. కోనేరు చుట్టూ అమర్చిన విద్యుద్దీపాలంకరణ, బాణసంచా పేలుళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దుర్గా పీఠం స్వామిజీ శ్రవణ చైతన్యానంద భక్తులకు ఉపదేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గంటా రవితేజ, లీలావతి, ఎంపీపీ రాంబాబు, ఈఓ నానాజీబాబు, నగేష్‌కుమార్, వాసు, బీజేపీ నేత రామానాయుడు, వైసీపీ నేత లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవంలో భాగంగా ఆకట్టుకున్న మహిళల కోటాటం



స్వామికి పూజలు చేస్తున్న గంటా రవితేజ, ఇతర నాయకులు

క్రైం... crime news

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

» పరీక్ష బాగా రాయలేదనే మనస్తాపమే కారణం

మద్దిలపాలెం, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : గణితం పరీక్ష బాగా రాయలేదన్న మనస్తాపంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి నిద్రపోయిన సమయంలో గది శ్లాబ్‌కు ఉన్న ఇనుపరాడ్డుకు చున్నీ బిగించి ఉరివేసుకుంది. ఇందుకు సంబంధించి త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాల్తేరు అప్‌ల్యాండ్ సీషెల్ అపార్ట్‌మెంట్‌లో కుటుంబ సభ్యులతో నివాసముంటున్న ఎస్.శ్రీవర్షిణి (17) నారాయణ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తండ్రి సుధాకర్ అబుదాబిలో పోర్టులో పని చేస్తున్నందున తల్లి లీనా, కుమార్తె అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం వర్షిణి ఇంటర్ పరీక్షలు రాస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 10న (మంగళవారం) జరిగిన గణితం పరీక్షను బాగా రాయకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందింది. పరీక్ష నుంచి ఇంటికి వచ్చినప్పటి నుంచి ముభావంగా ఉండడంతో తల్లి ఎందుకు అలా ఉన్నావని ప్రశ్నించగా పరీక్ష బాగా రాయలేకపోయానని వర్షిణి చెప్పి బాధపడింది. మంగళవారం రాత్రి తల్లితో కలిసి నిద్రపోయింది. బుధవారం వేకువజాము మూడు గంటల సమయంలో తల్లి లేచి చూసేసరికి వర్షిణి గదిలో రాడ్డుకు ఉరి వేసుకోగా, మృతదేహం వేలాడుతూ కనిపించింది. దీనిపై లీనా మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ సురేష్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

స్తంభం కూలిన ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై విశాఖ డెయిరీ వద్ద మంగళవారం విద్యుత్ స్తంభం విరిగిపడిన దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బి.కామేశ్వరరావు (37) బుధవారం ఉదయం మృతి చెందారు. ఉపాధి దొరుకుతుందేమోనన్న ఆశతో అనకాపల్లి జిల్లా కె.కోటపాడు నుంచి విశాఖ డెయిరీ వద్దకు వచ్చిన కామేశ్వరరావు విద్యుత్ స్తంభం కూలడంతో మృత్యువాత పడడం బాధాకరం. ఈ ఘటనలో గాయపడిన సత్యవతి చికిత్స పొందుతున్నారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిని మోసగించిన వ్యక్తిపై ఫిర్యాదు

మహారాణిపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వృద్ధురాలైన తల్లిని మోసగించి ఆమె వద్ద ధనాన్ని దోచుకొని తప్పుడు వీసాతో విదేశాలకు వెళ్లిపోయిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవని బాధితురాలి కుమారుడు సత్యప్రసాద్ తెలిపారు. ఆనందపురం మండలం తుర్లవాడకి చెందిన వృద్ధురాలికి కొంతకాలంగా మతిస్థిమితం లేదు. ఆమె మనుమడిగా పేర్కొంటూ ఎస్.ధర్మకళ్యాణ ఎవరూ లేని సమయంలో నకిలీ పత్రాలపై సంతకాలు చేయించుకొని కొంతధనాన్ని దోచుకొని విదేశాలకు వెళ్లిపోయాడని తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని, వారు చర్యలు తీసుకోకపోవడంతో కమిషనర్‌కు విన్నవించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి నుంచి 40 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ సిబ్బందితో బుధవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో బిహార్‌కు చెందిన పంకజ్‌కుమార్, గోల్డెన్ కుమార్ రైల్లో మహారాష్ట్రకు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. నిందితులను కోర్టుకు తరలించారు.

అప్పన్నకు కప్పస్తంభ ఆదాయం రూ.7.77 లక్షలు

సింహాచలం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని కప్పస్తంభ ఆలింగనాల ద్వారా ఖజానాకు సుమారు రూ.7.77 లక్షల ఆదాయం సమకూరింది. ఫిబ్రవరిలో దేవస్థానం నిర్ణయించిన రూ.25లు చెల్లించి 31,098 మంది భక్తులు కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. గతంలో మాదిరిగా కప్పస్తంభ టిక్కెట్లపై స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా ఇచ్చే అంశాన్ని పునఃపరిశీలించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ



సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసిన జగన్ ఇప్పుడు వారిని ఉద్ధరిస్తున్నట్టు మాట్లాడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ బకాయిపడిన వేలకోట్ల ఫీజులను కూటమి ప్రభుత్వం తీరుస్తోందన్నారు. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కాక పదిలక్షల మంది విద్యార్థులు నరకం చూశారన్నారు. విద్యార్థులను నిలువునా మోసంచేసిన వైసీపీ ఇప్పుడు యువత పోరు పేరుతో వారిని మళ్లీ మోసం చేయడానికి యత్నిస్తోందన్నా రు. జగన్ గద్దె దిగే సరికి రూ.4 వేల కోట్ల ఫీజు బకాయిలుండగా కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు రూ.789 కోట్లు విడుదలచేసిందన్నారు. జగన్ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక పలువురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. సమావేశంలో నేతలు గొంప సత్యనారాయణ, పొలమరశెట్టి శ్రీనివాసరావు, వెల్లంకి భరత్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 25 నుంచి చర్లపల్లి మీదుగా జన్మభూమి

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ-లింగంపల్లి మధ్య నడుస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసుల రాకపోకల మార్గాన్ని మార్పు చేయనున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 12805, 12806 నంబర్లు గల ఈ రైళ్లు ఏప్రిల్ 25 నుంచి శాశ్వత ప్రాతిపదికన చర్లపల్లి-అమ్ముగుడ-సనత్‌నగర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. సికింద్రాబాద్, బేగంపేట స్టేషన్లలో హాల్ట్‌ను కూడా ఎత్తివేస్తామన్నారు. దీంతో విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805) ఏప్రిల్ 25 నుంచి ఉదయం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి సాయంత్రం 6.05 గంటలకు చర్లపల్లి, రాత్రి 7.40 గంటలకు లింగంపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806) ఏప్రిల్ 26 నుంచి ఉదయం 6.15 గంటలకు లింగంపల్లిలో బయలుదేరి 7.15 గంటలకు చర్లపల్లి, రాత్రి 7.45 గంటలకు విశాఖ చేరనుంది. మార్గ మధ్యంలోని స్టేషన్లు, హాల్ట్‌ల సమయాలలో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు. ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలని కోరారు.

రైళ్ల గమ్యాల కుదింపు

సూరత్ స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్ల గమ్యాలను ఉద్నా స్టేషన్ వరకు కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-గాంధీధాం ఎక్స్‌ప్రెస్ రైలు (20803) ఈ నెల 13, 27న విశాఖ నుంచి ఉద్నా వరకు నడుస్తుంది. పూరి-అహ్మదాబాద్ ఎక్స్‌ప్రెస్ (12843) ఈ నెల 12, 28 తేదీల్లో....పూరి-వోకా ఎక్స్‌ప్రెస్ (20819) ఈ నెల 16, 30 తేదీల్లో....పూరి-గాంధీధాం ఎక్స్‌ప్రెస్ (22974) ఈ నెల 15, 27 తేదీల్లో ఉద్నా వరకు నడుస్తాయని, ఉద్నా, సూరత్ మధ్య రాకపోకలు రద్దు చేశామని పేర్కొన్నారు.

ఏయూ సైన్స్ హాస్టల్ రాత్రి భోజనంలో జెర్రి

» సిబ్బంది తీరుపై ఆందోళనకు దిగిన విద్యార్థులు

» నచ్చజెప్పిన వర్సిటీ అధికారులు



హాస్టల్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ హాస్టళ్లలో బుధవారం రాత్రి విద్యార్థులకు వడ్డించిన భోజనంలో జెర్రి కనిపించింది. దీంతో ఒక్కసారిగా విద్యార్థులు కంగారుపడి హాస్టల్ నిర్వాహకులను నిలదీశారు. తరువాత హాస్టల్ నుంచి ఖాళీ ప్లేట్లతో ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని, ఆందోళన చేపట్టారు. వర్సిటీ అధికారులు జోక్యం చేసుకుని విద్యార్థులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

భీమిలి బీచ్‌లో పునాదుల తొలగింపు పనులు

» రూ.50 లక్షలు ఖర్చవుతుందని అధికారుల అంచనా



ఎక్స్‌కవేటర్‌తో పునాదులు తొలగిస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భీమునిపట్నం బీచ్‌లో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహా రెడ్డి నిర్మించిన పునాదులను సమూలంగా తొలగించేందుకు జీవీఎంసీ అధికారులు బుధవారం ఎక్స్‌కవేటర్‌లతో పనులు ప్రారంభించారు. ఈ అంశంపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టులో పిటిషన్ వేయడంతో జాయింట్ కమిటీతో హైకోర్టు సర్వే చేయించిన సంగతి తెలిసిందే. ఆ కమిటీ కూడా పునాదులను పూర్తిగా తొలగించలేదని మరో ఫిర్యాదు అందడంతో వాటిని పూర్తిగా తీసేసి, దానికి అయిన వ్యయాన్ని నేహారెడ్డి కంపెనీ నుంచి వసూలు చేయాలని, ఆ నివేదికను తదుపరి వాయిదాలో సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. దానికి సమయం దగ్గర పడడంతో జీవీఎంసీ అధికారులు బుధవారం భీమిలి వెళ్లి పునాదుల ప్రాంతాన్ని తవ్వారు. అవి ఎనిమిది నుంచి పది అడుగుల లోతు న్నట్టు గుర్తించారు. రెండు అడుగుల వెడల్పున సుమారుగా 600 మీటర్ల మేర నిర్మించిన వాటిని తొలగించడానికి సుమారుగా రూ.50 లక్షల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇదే విషయాన్ని హైకోర్టుకు సమర్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.